ఈ-శ్రమ్‌తో కార్మికులకు భరోసా

అసంఘటితరంగాల్లో వారికి ఎంతో మేలు

- ప్రమాదవశాత్తూ మృతిచెందితే బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం
- 50 శాతానికిపైగా గాయపడితే రూ.లక్ష వరకు పరిహారం
- పేర్లు నమోదుకు పలుచోట్ల అందుబాటులో సేవలు

· 8లో

రెవెన్యూ సమస్యలు ఏకరువు

అధికారుల తీరుపై ఎమ్మెల్యేల అసంతృప్తి

- విశాఖ కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు, ఇతర అధికారులతో ప్రాంతీయ సదస్సు నిర్వహణ
- మంత్రి అనగాని సత్యప్రసాద్ హాజరు



సమావేశానికి హాజరైన అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి



సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్. పక్కన హోం మంత్రి వంగలపూడి అనిత, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, ఎమ్మెల్సీ చిరంజీవిరావు

- విశాఖలో 70 వేల మంది పేదలకు కన్వేయన్స్ డీడ్స్ ఇవ్వాల్సి ఉందన్న ఎమ్మెల్యే గణబాబు
- గత ప్రభుత్వంలో జరిగిన భూ కుంభకోణాలపై విచారణ లేదు... తమ బాధ ఎవరికి చెప్పుకోవాలన్న వెలగపూడి
- క్రిస్టియన్ మిషనరీస్ భూములను 22ఏలో చేర్చాలని కోరిన పల్లా
- దసపల్లా భూముల వ్యవహారంపై విచారణకు డిమాండ్
- ప్రభుత్వ భూములతోపాటు ప్రైవేటు భూములు 22 ఏలో పెట్టడంతో ఇబ్బంది తలెత్తుతుందన్న ఎమ్మెల్సీ దువ్వారపు
- తాడి గ్రామ తరలింపునకు చర్యలు తీసుకోవాలన్న పంచకర్ల
- గ్రీవెన్స్‌లో ఫిర్యాదులపై తమకు సమాచారం ఉండడం లేదన్న సుందరపు
- జగనన్న కాలనీలకు భూ సమీకరణలో అవకతవకలు జరిగాయన్న బండారు
- విచారణ జరిపి సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ

విశాఖపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):

రెవెన్యూ సమస్యలపై ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు గళం విప్పారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కరించడంలో ఎదురవుతున్న ఇబ్బందులను రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అధికారులు, ప్రతినిధులతో మంగళవారం మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతోపాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరును ఎండగట్టారు. కొంతమంది అధికారుల తీరు దారుణంగా ఉందంటూ తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు.

నగర పరిధిలో సుమారు 70 వేల మందికి గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని, వారికి కన్వేయన్స్ డీడ్స్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. ఈ సమస్యపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. ఈ సమస్య ఒక్క విశాఖ నగరంలోనే కాకుండా రాష్ట్రమంతటా ఉందని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చెప్పారు. నాడు పట్టాల పంపిణీని చంద్రబాబునాయుడు పండగలా చేశారని, ఇప్పటికీ వారికి కన్వేయన్స్ డీడ్స్‌ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి పేషీ నుంచి లెటర్ వచ్చినా అధికారులు స్పందించడం లేదని వెలగపూడి ఆగ్రహం వ్యక్తంచేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కుంభకోణాలపై విచారణ లేదని, తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో కూడా అర్థం కావడం లేదన్నారు. అధికారులు వెళ్లిపోతామంటే ఎలాగని సిసోడియాను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. 388 జీవో ప్రకారం ఆక్రమణలకు పాల్పడిన ఏడు వేల మందికి రెగ్యులర్ చేశామని అధికారులు చెబుతున్నారని, కానీ, గత ప్రభుత్వం నాలుగు వేల మందికి మాత్రమే చేసిందన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కలెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, సీసీఎల్‌ఏకు లేఖ రాసినా స్పందన లేదన్నారు. రూపాయి ఖర్చు లేని పనులను కూడా తాత్సారం చేస్తున్నారన్నారు. 'మంచి ప్రభుత్వమని మనం చెప్పుకోవడం కాదు. ప్రజలు చెప్పుకోవాలంటే సరిగా పనిచేయాలి' అని వెలగపూడి స్పష్టంచేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ నగర పరిధిలోని కీలకమైన ప్రాంతాల్లో ఉన్న సీబీసీఎన్‌సీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. దేవదాయ శాఖకు చెందిన భూములను 22లో పెట్టి ఆక్రమణలకు గురికాకుండా కాపాడుతున్నామని, మరి క్రిస్టియన్ మిషనరీలకు చెందిన భూములను అందులో చేర్చి ఎందుకు పరిరక్షించకూడదని పల్లా ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షల కోట్ల రూపాయల విలువైన క్రిస్టియన్ ల్యాండ్స్ ఉన్నాయని, వాటిని పరిరక్షించాలంటే 22-ఏ జాబితాలో చేర్చడం ఒక్కటే మార్గమన్నారు. దసపల్లా భూములపై తాము ప్రతిపక్షంలో ఉండగా పోరాటం చేశామని, ప్రభుత్వ భూములను రక్షిస్తామని చెప్పామన్నారు. అక్కడ నిర్మాణాలు జరిగితే తామేం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దసపల్లా భూములపై సరైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంటుకు సంబంధించి సరిహద్దు ... మిగతా 8వ పేజీలో

అన్నదాత కలవరం

అల్పపీడనం ప్రభావంతో మారిన వాతావరణం

- ఆకాశం మేఘావృతంతోపాటు తేలికపాటి జల్లులు
- వరి కోతలు నిలుపుదల, ఆదరాబాదరాగా కుప్పలు
- నేడు, రేపు జిల్లాకు భారీ వర్ష సూచన
- అందివచ్చిన పంట చేతికి దక్కదేమోనని రైతులు ఆందోళన



కోటవురట్ల మండలం లింగాపురంలో కుప్ప వేయని వరి పనలు



చీడికాడలో కుప్ప వేయడానికి వరి పనలు మోసుకెళుతున్న రైతులు

చోడవరం/ అనకాపల్లి టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో బుధ, గురువారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం వుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘవృతమైంది. రాత్రి ఆరు గంటల తరువాత జల్లులు మొదలయ్యాయి. పలుమండలాల్లో దఫదఫాలుగా మోస్తరు వర్షం పడుతున్నది. దీంతో గత రెండు, మూడు రోజుల్లో వరి కోతలు పూర్తిచేసి, కుప్ప వేయని రైతులు గుబులు చెందుతున్నారు.

బంగాళాఖాతంలో వరుసగా ఏర్పడుతున్న అల్పపీడనాలు అన్నదాతలను తీవ్ర కలవరానికి గురి చేస్తున్నాయి. ఈ నెలలో ఇప్పటికే రెండుసార్లు అల్పపీడనాలు ఏర్పడి, వాయుగుండాలుగా, తుఫాన్‌గా బలపడిన విషయం తెలిసిందే. అయితే వాటి ప్రభావం అనకాపల్లి జిల్లాపై మోస్తరుగా వుండడం, అప్పటికి వరికోతలు ప్రారంభ దశలో వుండడంతో పెద్దగా నష్టం వాటిల్లలేదు. కానీ మూడు రోజుల క్రితం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మంగళవారం పశ్చిమ వాయువ్య దిశగా పయనించి, బుధవారంనాటికి ఏపీలోని ఉత్తర, మధ్య కోస్తా జిల్లాల దిశగా రానున్నదని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. దీని ప్రభావంతో బుధ, గురువారాల్లో కోస్తాలోని పలు జిల్లాలతోపాటు అనకాపల్లి జిల్లాలో కూడా భారీ నుంచి అతిభారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. తరువాత రెండు రోజులు కూడా వర్షాలు కురిసే అవకాశం వుందన్న సమాచారంతో వరి, పత్తి, పొగాకు రైతులు అప్రమత్తంగా ఉండాలని, వరి కోతలు వాయిదా వేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.



సబ్బవరం మండలం నాయనమ్మపాలెంలో వరి పనలను కుప్పలుగా పెడుతున్న రైతులు

గింజ రాలిపోతుందేమోనని..

బంగాళాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తాయని, అందువల్ల వరి కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు రెండు, మూడు రోజుల నుంచి చెబుతూనే వున్నాయి. అయితే ఇప్పటికే వరి కోతలు ఆలస్యం అయ్యాయని, ఇంకా ఆలస్యం చేస్తే గింజ రాలిపోతుందన్న భయంతో రైతులు సోమవారం వరకు వరి కోతలు కోస్తూనే వున్నారు. మంగళవారం ఆకాశం మేఘావృతం కావడంతో వరి కోతలు ఆపేశారు. గత రెండు, మూడు రోజుల్లో వరి కోతలు కోసిన రైతులు, మంగళవారం ఆదరాబాదరాగా కుప్పలు వేసుకున్నారు. కాగా మంగళవారం రాత్రి పది గంటల సమయానికి జిల్లాలో అచ్యుతాపురం, రాంబిల్లి, కశింకోట, ఎలమంచిలి, అనకాపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల, రావికమతం, ఎస్.రాయవరం, నక్కపల్లి, పరవాడ మండలాల్లో దఫదఫాలుగా జల్లులు పడుతున్నాయి.

ఇదిలావుండగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం ఆలస్యమైనప్పటికీ, తరువాత వర్షాలు బాగానే కురిసి వాతావరణం సహకరించడంతో వరి పంట సంతృప్తికరంగా పండింది. పెట్టుబడితోపాటు శ్రమకు తగిన ఫలితం లభిస్తుందని భావించారు. కానీపంట చేతికి వచ్చేసమయంలో అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫాన్ల ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఇంటికి చేరుతుందా లేకపోతే వర్షం పాలవుతుందా అని గుబులు చెందుతున్నారు.

వరికోతలు వాయిదా వేసుకోవాలి

బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం ప్రభావంతో అనకాపల్లి జిల్లాలో కూడా భారీ వర్షాలు కురుస్తాయని సమాచారం వుంది. అందువల్ల వర్షాలు పూర్తిగా తగ్గి, సాధారణ వాతావరణ పరిస్థితులు ఏర్పడే వరకు రైతులు వీలైనంతమేర వరి కోతలు వాయిదా వేసుకోవడం మంచిది. - **ఎ.పావని**, ఏవో, చోడవరం

తాండవ డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక ఏకగ్రీవం

అన్నింటినీ కైవసం చేసుకున్న టీడీపీ మద్దతుదారులు

- 21వ తేదీన ప్రాజెక్టు చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక
- డీసీ-4 అధ్యక్షుడు కరక సత్యనారాయణకు ఛాన్స్?



ఎన్నికల అధికారి జి.శ్రీనివాసరావు నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న తాండవ డిస్ట్రిబ్యూటరీ కమిటీ-4 అధ్యక్షుడు కరక సత్యనారాయణ

నర్సీపట్నం/ నాతవరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఏకైక మేజర్ ఇరిగేషన్ నీటి ప్రాజెక్టు అయిన తాండవ రిజర్వాయర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీల (డీసీ) ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మొత్తం ఐదు కమిటీల అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు ఎన్నికయ్యారు. దీంతో ప్రాజెక్టు చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులకు టీడీపీ మద్దతుదారులే ఎన్నిక కావడం ఖాయమైంది.

తాండవ జలాశయం పరిధిలో మొత్తం 24 నీటి సంఘాలకుగాను 16 సంఘాలు అనకాపల్లి జిల్లాలో, 11 సంఘాలు కాకినాడ జిల్లా పరిధిలో ఉన్నాయి. వీటికి ఇటీవల ఎన్నికలు నిర్వహించగా డైరెక్టర్లతోపాటు అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐదు డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. వీటిల్లో మూడు అనకాపల్లి జిల్లా పరిధిలో, రెండు కాకినాడ జిల్లా పరిధిలో వున్నాయి. అనకాపల్లి జిల్లా పరిధిలోని డీసీలకు తాండవ డీఈఈ కార్యాలయంలో, కాకినాడ జిల్లా పరిధిలోని డీసీలకు కోటనందూరులో ఎన్నికలు నిర్వహించారు. తాండవ డీఈఈ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికలకు నర్సీపట్నం ఆర్డీవో వీ వీరమణ, అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆలీషా, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహనరావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. 16 నీటి సంఘాల ... మిగతా 8వ పేజీలో



నర్సీపట్నం ఆర్డీవో రమణ నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న డిస్ట్రిబ్యూటరీ కమిటీ-1 అధ్యక్షుడు పారుపల్లి వరహాలబాబు

పోలీసు స్టేషన్లలో సమ్మేటివ్ ప్రశ్నాపత్రాలు

గణితం పేపర్ లీక్ కావడంతో ప్రభుత్వం చర్యలు



నర్సీపట్నం పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నాపత్రాలను హెచ్‌ఎంకు అందజేస్తున్న సిబ్బంది



ఎలమంచిలి పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరిన సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ప్రశ్నాపత్రాల బాక్సులు

నర్సీపట్నం/ ఎలమంచిలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):

ఉన్నత పాఠశాలల సమ్మేటివ్ అసెస్‌మెంట్ టర్మ్-1 (సెల్ఫ్ అసెస్‌మెంట్‌గా పేరు మార్పు) పరీక్షా ప్రశ్నాపత్రాలను తొలిసారి పోలీస్‌స్టేషన్లలో భద్రపరుస్తున్నారు. సాధారణంగా సమ్మేటివ్ పరీక్షల పశ్నాపత్రాలను ఎంఈవో కార్యాలయంలో భద్రపరిచి, ఏ రోజుకారోజు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు అందజేసేవారు. సోమవారం గణితం పరీక్ష పశ్నాపత్రం లీకై యూట్యూబ్‌లో ప్రత్యక్షం కావడంతో విద్యాశాఖ ఉన్నతాధికారులు అప్రమత్త మయ్యారు. ఈ పరీక్షను 20వ తేదీకి వాయిదా వేశారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను కూడా పకడ్బందీగా నిర్వహించాలని, ప్రశ్నాపత్రాలు లీక్ కాకూడదన్న ఉద్దేశంతో పబ్లిక్ పరీక్షల మాదిరిగా పోలీస్ స్టేషన్‌లలో భద్రపరచాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సానుకూలంగా స్పందించారు. రోజూ ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు లేదా సిబ్బంది పోలీసు స్టేషన్లకు వెళ్లి ప్రశ్నాపత్రాలను తీసుకుంటారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు ఈ నెల తొమ్మిదో తేదీన ప్రారంభంకాగా సోమవారం వరకు పశ్నాపత్రాలను ఎంఈవో కార్యాలయాల్లో వుంచారు. గణితం ప్రశ్నాపత్రం లీక్ కావడంతో మిగిలిన పరీక్షల ప్రశ్నాపత్రాలను సమీపంలోని పోలీసు స్టేషన్లకు తరలించారు. మంగళవారం 6, 7 తరగతుల జనరల్ సైన్స్, 8, 9, 10 తరగతుల భౌతిక శాస్త్రం పశ్నాపత్రాలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పోలీసు స్టేషన్లకు వెళ్లి తీసుకువచ్చి పరీక్షలు నిర్వహించారు.

ప్రభుత్వ భూమిలో ఇసుక తవ్వకాలు

అభ్యంతరం చెప్పిన జిరాయితీ భూమి రైతుపై దాడి

- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు
- పది రోజులైనా పట్టించుకోని పోలీసులు
- కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు
- స్పందించిన జిల్లా అధికారులు
- క్షేత్రస్థాయిలో గనులు, పంచాయతీ, రెవెన్యూ అధికారులు విచారణ



ప్రభుత్వ భూమిలో ఇసుక తవ్వకాలతో ఏర్పడిన భారీ గోతులు

మాకవరపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని జంగాలపల్లిలో ప్రభుత్వ భూమిలో అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. దీనివల్ల పక్కనున్న తమ జిరాయితీ భూములకు నష్టం వాటిల్లుతుందని ఓ రైతు అడ్డుకోగా, ఇసుక అక్రమార్కులు అతనిపై ... మిగతా 8వ పేజీలో

దార్లపూడి రెవెన్యూ సదస్సులో 58 వినతులు

ఎస్.రాయవరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 58 వినతులు స్వీకరించినట్టు తహసీల్దార్ జె.రమేష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో డీటీ,సర్వేయర్ పాల్గొన్నారు.



అన్నదాతల్లో అల్పపీడనం గుబులు

- వాతావరణం మార్పుతో పొలాలకు పరుగు
- వరి పనలను కుప్పలు పెట్టిన రైతులు

కోటవురట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపథ్యంలో అన్నదాతల్లో గుబులు పట్టుకుంది. మంగళవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం కావడం, ఈదురు గాలులు వీస్తుండడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడంతో వరి పంట బాగా పండింది. దీంతో రైతులు ఎంతో సంతోషంతో ఉన్నారు. పంట కోతకు వచ్చిన సమయంలో అల్పపీడనాలు ఏర్పడుతుండడంతో వారు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది పంట చేతికి వచ్చే సమయంలో కూడా ఒడిదుడుకులు తప్పలేదు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఏర్పడుతుందేమోనని భయపడుతున్నారు. ఇప్పటికే పండిన పంటను సగంపైగా రైతులు కోసేశారు. మిగిలిన రైతులు పంటను కాపాడుకోవడానికి పొలాలకు పరుగులు పెడుతున్నారు. కొంతమంది రైతులు కోసిన పంటను పొలాల్లోనే ఆరబెట్టారు. వర్షం కురిస్తే పండిన పంట ఎక్కడ నేలపాలవుతుందోనని వాటిని కుప్పలుగా పెట్టారు. ఇంకా కోయని వరి పంటను నేలకు ఒరగకుండా కడుతున్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

వరుస అల్పపీడనాలు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. ఈ నెలలో ఇప్పటికే రెండు అల్పపీడనాలు ఏర్పడడంతో రైతులు వరి పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. మరో అల్పపీడనం ఉందని వాతావరణ శాఖ ప్రకటించినప్పటికీ సోమవారం ఎండ కాయడంతో రైతులు వరి కోతలు ప్రారంభించారు. అల్పపీడనం ప్రభావంతో మంగళవారం ఒకసారిగా వాతావరణం మారడంతో కోసిన వరి పనలను రైతులు కళ్లాలకు తరలించి, కుప్పలు పెట్టారు. మండలంలోని మంగవరం, సత్యవరం, పెదరాంభద్రపురం, పెంటకోట గోపాలపట్నం, శ్రీరాంపురం, గుంటపల్లి తదితర గ్రామాలలో ఇప్పటికే వరికోతలు కోశారు. ఎక్కడ చూసినా పొలాల్లో వరి పనలు కనిపిస్తున్నాయి. అల్పపీడనం వలన వరి కోతలు వాయిదా వేద్దామన్న రైతులు ఇప్పటికే అపరాలు చల్లారు. కోత ఆలస్యం అయితే వరి పంట గింజలు రాలిపోతాయని, కోత సమయంలో తొక్కేస్తే మొలకెత్తిన అపరాల మొక్కలు చనిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ అల్పపీడనం గండం నుంచి గట్టెక్కించాలని మొక్కుకుంటున్నారు.


పెదరాంభద్రపురం పొలాల్లో ఉన్న వరి పనలు


తంగేడులో కుప్పలు వేస్తున్న రైతులు

రైతులు అప్రమత్తంగా ఉండాలి

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి కోతలు కోసిన రైతులు కుప్పలను వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ అన్నారు. మండలంలోని కుమారపురం, ఎస్.నర్సాపురం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయం, ప్రభుత్వం అందించే పథకాలు వివరించారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి నక్కపల్లి భూ సమస్య

నక్కపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) నక్కపల్లి గ్రామ కంఠం సర్వే నంబరు 237/2లో వున్న భూ సమస్యను రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి మంగళవారం హోం మంత్రి అనిత నేతృత్వంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ తీసుకెళ్లారు. పూర్వం నుంచి గ్రామ కంఠంలో నివాసగృహాలు ఏర్పాటు చేసి నివసిస్తున్నారని, అవసరం కోసం కొందరు క్రయ,విక్రయాలు జరుపుకునేవారని వెంకటేశ్ వివరించారు. ఇటీవల కాలంలో ఈ సర్వే నంబరు 22ఏలో చేర్చారని, వాటిని తొలగించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని మంత్రులిరువురు జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చినట్టు వెంకటేశ్ చెప్పారు.


రెవెన్యూ మంత్రికి సమస్యను వివరిస్తున్న వెంకటేశ్



డ్రోన్ల హబ్‌గా ఏపీ : ఎమ్మెల్యే

అచ్యుతాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ దీదీ పథకం వల్ల ఏపీ డ్రోన్ల హబ్‌గా మారబోతోందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయాభివృద్ధికి వినూత్న పథకాలు అమలు చేస్తున్నారన్నారు. డ్రోన్ల ద్వారా వ్యవసాయానికి పట్టే చీడపీడలపై మందులు పిచికారీ చేయడం వల్ల ఖర్చుతోపాటు దిగుబడి కూడా అధికంగా వస్తుందన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయాభివృద్ధికి కృషిచేయాలి : సుందరపు

వ్యవసాయాభివృద్ధికి నీటి సంఘాల కార్యవర్గం కృషిచేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఇటీవల జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో వి.జయం సాధించిన సంఘ కార్యవర్గ సభ్యులు సోమవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయకుమార్‌ను నీటి సంఘం కార్యవర్గం సన్మానించింది. కార్యక్రమంలో గూడేల కనకారావు, అగ్గాల హనుమంతరావు, కాయల వసంతరావు, కూనిశెట్టి సత్తిబాబు, అగ్గాల భాస్కర్, చిన్ని దొరబాబు, అడపా మహాలక్ష్మి, కొల్లాటి బాబూరావు, నాగేశ్వరరావు, పీలా శివ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అభిజిత్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

అచ్యుతాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అభిజిత్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. మంగళవారం అభిజిత్ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్మాగారం యాజమాన్యం అక్టోబరు 13న లేఆఫ్ ప్రకటించిందన్నారు. దీనిపై 35 రోజులు ఆందోళన చేయడంతో నవంబరు 15న బోనస్ ఇచ్చారని, 30 నాటికి జీతాలిస్తామని చెప్పినా ఇంతవరకు జీతాలు ఇవ్వలేదన్నారు. యాజమాన్యం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు

పంచాయతీల ప్రగతితోనే సుస్థిర అభివృద్ధి

- డీఎల్‌డీఓ మంజులావాణి

ఎలమంచిలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో ముందంజలో పయనించేలా చేయడం ద్వారా సుస్థిర అభివృద్ధిని సాధించవచ్చునని డీఎల్‌డీఓ మంజులావాణి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన అధికారులు, ప్రజాప్రతినిధులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె సుస్థిర అభివృద్ధిని సాధించడంలో తోడ్పడే అంశాలను వివరించారు. ఈ సమావేశంలో అబ్జర్వర్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ కేఎస్. కొండలరావు, ఎంపీపీ బోదెపు గోవింద్, వైస్ ఎంపీపీ రాజాన శేషు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను కలిసిన ఖన్నా సాహెబ్

ఎలమంచిలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌ను విజయవాడలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసినట్టు స్థానిక జామియా మసీద్ మేనేజింగ్ కమిటీ జనరల్ సెక్రటరీ షేక్ ఖన్నా సాహెబ్ తెలిపారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రతి అంశాన్ని శ్రద్ధగా వినాలి : ఎంపీడీవో

మునగపాక, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శిక్షణ తరగతుల్లో బోధిస్తున్న ప్రతి అంశాన్ని శ్రద్ధగా వినాలని స్థానిక ఎంపీడీవో ఎం.ఉషారాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సచివాలయ ఉద్యోగులు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. ఇక్కడ చెబుతున్న ప్రతి అంశం ఉద్యోగుల విధి, విధానాలకు దోహద పడతాయన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించడం, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు వెలుగులకు విఘాతం ఏర్పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.





















న్యాయంపూడి సర్పంచ్‌కు సన్మానం


సర్పంచ్‌ను సన్మానిస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ పంచాయతీ అవార్డు న్యాయంపూడి పంచాయతీకి రావడంతో జిల్లాకే గుర్తింపు వచ్చిందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం న్యాయంపూడి సర్పంచ్ రెడ్డి వరహాలను విశాఖలోని తన నివాసంలో హోం మంత్రి అనిత సత్కరించారు. డీపీవో శిరీషారాణి, డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఎంపీడీవో డీ సీతారామరాజును హోం మంత్రి అనిత అభినందించారు.

30 మందికి కుట్టు శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ

రాంబిల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రూరల్ యూత్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో విశ్వాసి సంఘతి సహకారంతో మండల కేంద్రంలో మంగళవారం మహిళా సాధికారిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుట్టుశిక్షణ పొందిన 30 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రంగారావు, హౌసింగ్ ఏఈ అప్పలరాజు, వెలుగు సీసీ లక్ష్మి, ఆర్‌వైడీఎస్ కార్యదర్శి ఎస్.నూకరాజు, విశ్వాసి సంఘతి ప్రతినిధి సీహెచ్ స్టీవెన్, శిక్షకులు లావణ్య, గోవిందమ్మ పాల్గొన్నారు.

ఆంజనేయ వాహనంపై ఆపద్బాంధవుడు

నక్కపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. ఆంజనేయ వాహనంపై ఉభయదేవేరులతో స్వామివారిని మాఢ వీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధి వద్ద తిరుప్పావై పాశుర విన్నపం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు, అర్చకులు పాల్గొన్నారు.

బాలకార్మికుల గుర్తింపు ప్రత్యేక డ్రైవ్

ఎలమంచిలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కార్మిక, పోలీస్, సామాజిక వర్కర్ల బృందం మంగళవారం బాల కార్మికుల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్టు కార్మిక శాఖ అధికారి ఎస్.వెంకటేశ్వరావు తెలిపారు. పట్టణంలోని బేకరీలు, హోటల్‌లు, మెకానిక్ షెడ్లు, వస్త్ర, కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఏఎస్ఐ నాయుడుబాబు, మహిళా పోలీస్ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్త రమ్య, బాలల పరిరక్షణ ప్రతినిధి లోవరాజు పాల్గొన్నారు.

రబీ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

రాంబిల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రబీలోని వరి, అపరాలు సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత అన్నారు. మంగళవారం చినకలవలాపల్లిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె యాజమాన్య పద్ధతులు, పీఎం కిసాన్‌పై అవగాహన కల్పించారు. సర్పంచ్ వై.శ్రీనివాసరావు, సిబ్బంది కె, సంతోషి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

'పెన్షనర్ల సంక్షేమానికి కృషి'


80 ఏళ్లు దాటిన వారిని సన్మానిస్తున్న దృశ్యం

ఎలమంచిలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సంక్షేమానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఎలమంచిలి తాలూకా అధ్యక్షుడు సీహెచ్.సోమేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎన్‌జీవోహోమ్ ఆవరణలో పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సబ్ ట్రెజరీ అధికారి ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ నిబంధనల మేరకు పెన్షనర్లకు అన్ని విధాలా సేవలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సంఘ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశాఖ కో-ఆపరేటివ్ జీఎం. ఎంవీ గణేష్ కుమార్, ఎస్‌బీఐ. చీఫ్ మేనేజరు రవికుమార్ సంఘం కార్యదర్శి జి.సాంబమూర్తి, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగవరం, అరట్లకోట గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులను 20 లీటర్ల నాటుసారాతో అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. అలాగే ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామన్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్ఐ సోమయ్య, సిబ్బందితో కలిసి దాడి చేసి అరట్లకోట సమీపంలో పట్టుకున్నట్టు తెలిపారు. వారిని ఎలమంచిలి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండు విధించినట్టు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి సమష్టి కృషి : ఎంపీడీవో

పాయకరావుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషిచేయాలని ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ హాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సుపరిపాలన, ఆర్థికాభివృద్ధి, ఆరోగ్యవంతమైన గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఏఈ మహంకాలరావు, మండల పరిషత్ కార్యాలయ ఏఓ సీహెచ్‌ఆర్‌కే.వర్మ, పంచాయతీ కార్యదర్శి వైవీ.సత్యనారాయణ, పీఆర్ ఏఈ కచేరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య పాల్గొన్నారు.

'ఆడపిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఇవ్వాలి'

కోటవురట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు ఆడపిల్లలకు ఉజ్వల భవిష్యత్తును అందించాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథం అన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశమందిరంలో చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ నిర్వహించిన బేటీ బచావో...బేటీ పడావో, కిషోర్ వికాసంలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ ముందుకు రావాలన్నారు. ఎస్ఐ రమేష్ శిశు మరణాలు నివారణ, పోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ధనలక్ష్మి. సీడీపీవో శ్రీవిద్య ఈవోపీఆర్‌డీ రఘురాం, ఎంపీహెచ్‌వో గోవిందరావు పాల్గొన్నారు.

ఘనంగా యూత్ క్రిస్మస్ వేడుకలు

కోటవురట్ల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారు రాట్నాలపాలెం బెతస్థ ప్రార్థన మందిరంలో యూత్ కిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశాఖపట్నంకు చెందిన పాస్టర్ వినోద్‌కుమార్‌తోపాటు స్థానిక సంఘ కాపర్లు ఎస్.ఎలీషా ఆనంద్, సత్యాడదాసు, సన్యాసిరావు క్రిస్మస్ కేక్ కట్ చేశారు. యువతి, యువకులు పాడిన పాటలు పలువుర్ని ఆకట్టుకున్నాయి.

ఎమ్మెల్యేను కలిసిన నీటి సంఘం ప్రతినిధులు



ఎమ్మెల్యే బండారుతో దొరమామిడి కొట్టు సాగునీటి సంఘం ప్రతినిధులు

కె.కోటపాడు, డిసెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గుల్లేపల్లి గ్రామం దొరమామిడి కొట్టు సాగు నీటి సంఘం ఛైర్మన్ తంగేడు ముత్యాలు (శ్రీను),వైస్ ఛైర్మన్ డొంక వెంకటరమణ, డైరెక్టర్ మలిరెడ్డి పైడంనాయుడు తదితరులు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని మంగళవారం చోడవరం క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం నూతన సారథులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలోఎంపీటీసీ సభ్యుడు కశిరెడ్డి దేముడుబాబు, మాజీ సర్పంచ్ వేచలపు మల్లికాదేవి, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాళ్లపల్లి దేముడు బాబు, నాయకులు గొర్లె శంకరరావు, బి. నాగేశ్వరరావు, రాళ్లపల్లి చిన్నరామ్మూర్తి, కడపుట్ల గంగరాజు, డొంక దేముడుబాబు, వేచలపు రామునాయుడు, కశిరెడ్డి రాముడు, గుల్లేపల్లి అప్పారావు, డెక్క దేముడు ఉన్నారు.

అబాకస్ పోటీల్లో జ్యోష్ణశ్రీ దేవాన్షికి ద్వితీయ స్థానం



అబాకస్‌లో బహుమతి పొందిన జ్యోష్ణశ్రీదేవాన్షి

రావికమతం, డిసెంబరు 17, (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ అబాకస్ పోటీల్లో దొండపూడికి చెందిన చుక్క జ్యోష్ణశ్రీ దేవాన్షి ద్వితీయ స్థానంలో నిలిచి దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం అవార్డు అందుకుంది. జ్యోష్ణశ్రీ దేవాన్షి తండ్రి స్వామి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు. రెండో కుమార్తె జ్యోష్ణశ్రీదేవాన్షి నాలుగవ తరగతి చదువుతోంది. చదువుతోపాటు ఆటలంటే జ్యోష్ణశ్రీదేవాన్షికి ఇష్టం. ఈ నెల 14న ఢిల్లీలో జరిగిన ఇంటర్‌నేషనల్ అబాకస్ పోటీల్లో పాల్గొంది. వివిధ విభాగాల్లో 30 దేశాల నుంచి 10 వేల మంది పాల్గొన్న ఈ పోటీల్లో జ్యోష్ణశ్రీదేవాన్షి ఏ2 విభాగంలో ద్వితీయ విజేతగా గెలుపొంది. ఈ మేరకు ఢిల్లీ యూనివర్సిటీలో ఇంటర్ నేషనల్ అబాకస్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డాక్టర్, డినో వ్యాంగ్, ఇండియన్ అబాకస్ ప్రెసిడెంట్ డాక్టర్, స్నేహల్ కారియాలనుంచి జ్యోష్ణశ్రీ దేవాన్షి అవార్డు అందుకుంది. జ్యోష్ణశ్రీ దేవాన్షికి దొండపూడి గ్రామస్థులతోపాటు, పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

చెరకు రైతులకు కూటమి ప్రభుత్వ సహకారం ఏదీ?

» మాజీ ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



మాట్లాడుతున్న ధర్మశ్రీ, పక్కన వైసీపీ నాయకులు

చోడ వరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గోవాడ చెరకు రైతుల సంక్షేమంపై కూటమి ప్రభుత్వానికి కనీసం చిత్తశుద్ధి లేదని మాజీ ప్రభుత్వ విప్ వైసీపీ నాయకుడు కరణం ధర్మశ్రీ విమర్శించారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ పాలనలో గోవాడకు రూ. 90 కోట్ల గ్రాంటు రూపంలో తీసుకుని వచ్చి, రైతులను ఆదుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, గోవాడకు అండగా ఉంటామన్న ప్రకటనలు తప్పితే, ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. చెరకు రైతు బకాయిలు, రిటైరయిన కార్మికులకు గ్రాట్యుటీ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

21న జగన్ జన్మదిన వేడుకలు

ఈనెల 21న వైసీపీ అధినేత జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలని ధర్మశ్రీ పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. ఆ రోజున సేవా కార్యక్రమాలునిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు ఏడువాక సత్యారావు, బొడ్డేడ సూర్యనారాయణ, చందురాంబాబు, వెంపలి ఆనంద్, పుల్లేటి వెంకటరావు, డీవీ ఆర్, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ బడ్జెట్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గాడి కాసు

చోడవరం, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ బడ్జెట్ సమావేశం మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో, ఎంపీపీ గాడి కాసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ఆమోదంతో పాటు, 2025-26 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలు, ఆదాయంపై సమావేశంలో చర్చించారు. తొలుత బడ్జెట్ ప్రతిపాదనలు ఎంపీడీవో పీపీ ఎస్‌జే ఆంజనేయులు సభ్యులు ముందుంచారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం



ఎల్.బి.పట్నంలో దగ్ధమవుతున్న గడ్డిమేట్లు

చీడికాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఎల్‌బి.పట్నంలో జరిగిన అగ్నిప్రమాదంలో రెండు గడ్డిమేట్లు దగ్ధమయ్యాయి. దీంతో సుమారు రూ.15వేలు నష్టం వాటిల్లింది. గ్రా మానికి చెందిన సింగంపల్లి చెల్లయ్యమ్మ పొలం పనులకు వెళ్లిన తరువాత మంగళవానం సాయంత్రం 4.30గంటలకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. దీంతో పూర్తిస్థాయిలో ఒక గడ్డిమేటు, ధాన్యం బస్తాలున్న మరొక గడ్డిమేటు దగ్ధమయ్యాయి. రైతులు పొలాల నుంచి పరుగులుతీసి వచ్చినా ఫలితం లేకపోయింది. ఈ విషయాన్ని బాధిత రైతులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వగా వీఆర్‌వో మూర్తి వచ్చి నష్టాన్ని అంచనా వేశారు. ఈ నివేదికను తహసీల్దార్‌కి అందజేస్తానని వారు తెలిపారు.

పంచాయతీల సుస్థిర అభివృద్ధికి కృషి చేయాలి

రావికమతం, డిసెంబరు 17, (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఎంపీడీవో వెంకన్నబాబు పిలుపు నిచ్చారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2030 నాటికి ఐక్యరాజ్య సమితి సూచించిన ఆరోగ్యం, శుద్ధమైన తాగు నీరు, ఆహార భద్రత,పేదరిక నిర్మూలన తదితర లక్ష్యాల సాధనకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు

రోలుగుంట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాలు మండలంలోని ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా మంగళవారం కొవ్వూరులో భక్తులు నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ గ్రామ సంకీర్తనను భోగి పండుగ వరకు నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు.

సమన్వయంతో పనిచేస్తే గ్రామాలు ప్రగతి బాట

» సర్పంచులు, కార్యదర్శుల శిక్షణ శిబిరంలో మాకవరపాలెం, గొలుగొండ ఎంపీడీవోలు సీతామహాలక్ష్మి, మేరీ రోజీ



మాకవరపాలెంలో శిక్షణకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

మాకవరపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పల్లెలు సమగ్ర అభివృద్ధి చెందాలంటే సర్పంచులు, కార్యదర్శులు అవగాహనతో పనిచేయాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని, తద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఎంఈవో మూర్తి, వైద్యాధికారులు డాక్టర్ సీతామహాలక్ష్మి, డాక్టర్ కిరణ్, ఏపీవో వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండలో...

గొలుగొండ : గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంలో పనిచేయాలని గొలుగొండ ఎంపీడీవో మేరీ రోజీ సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులకు ఏర్పాటైన శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. ప్రణాళిక ద్వారా ముందుకు సాగితే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఇందుకు అంతా కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



గొలుగొండలో శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్న అధికారులు

సైన్స్ ప్రదర్శనకు చెట్టుపల్లి విద్యార్థుల నమూనా ఎంపిక

నర్సీపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెట్టుపల్లి జడ్పీహెచ్ స్కూల్‌లో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థులు కార్తీక్, రోహిత్ క్యూఆర్ కోడ్ అనుసంధానం చేసి రూపొందించిన అద్దె కొరకు (టు లెట్) ప్రకటన బోర్డు అగస్త్య ఇంటర్నేషనల్ సంస్థ నిర్వహించనున్న జిజ్ఞాస-2024 సైన్స్ ప్రదర్శనకు ఎంపికైందని ఉపాధ్యాయుడు రాజగోపాల్ తెలిపారు. రీజనల్ స్థాయిలో 400 నమూనాలు రాగా వాటిలో 44 నమూనాలు ఎంపికైనట్టు చెప్పారు. జిల్లా నుంచి చెట్టుపల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు క్యూఆర్ కోడ్‌తో అనుసంధానం చేసి రూపొందించిన అద్దె కొరకు ప్రకటన బోర్డు ఎంపికైందని వివరించారు.



కార్తీక్, రోహిత్ రూపొందించిన నమూనా

21న సీపీఎం బహిరంగ సభ

నర్సీపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడ ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న సీపీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. మహా సభలకు సంబంధించి పోస్టర్‌ను మంగళవారం ఇక్కడ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 20 నుంచి 22 వరకు నర్సీపట్నంలో మహా సభలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఐద్వా నాయకురాళ్లు గౌరీ, సూర్య ప్రభ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లు సంక్షేమ సమితిలో సభ్యులుగా చేరాలి

నర్సీపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పెన్షనర్ల సంఘంలోని సభ్యులు విశాఖపట్నంలోని పెన్షనర్స్ సంక్షేమ సమితిలో సభ్యత్వం కలిగి ఉంటే మరణానంతరం ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందుతుందని పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు వి.గజ్జాలమ్మ అన్నారు. ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం జాతీయ పెన్షనర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ సురేంద్ర పెన్షనర్స్ సంఘం సభ్యులతో కలిసి పెన్షనర్స్ పితామహుడు డీఎస్ నకరా చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు గజ్జాలమ్మ మాట్లాడుతూ పెన్షనర్స్ సంక్షేమ సమితిలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. మానసిక ప్రశాంతత, ఆరోగ్యానికి మెడిటేషన్ చాలా అవసరమని పేర్కొన్నారు. ఈనెల 21న నర్సీపట్నం టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహించనున్న ప్రపంచ మెడిటేషన్ డేలో పాల్గొని ధ్యానంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఎస్‌బీఐ మేనేజర్ రాఘవరావు మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల పెన్షనర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం సీనియర్ పెన్షనర్స్‌ను సన్మానించారు. ఎస్‌టీవో గణేశ్, ఏటీవో నాగేశ్వరరావు, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బీవీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : పెన్షనర్లకు జనవరి, ఫిబ్రవరి నెలల్లో లైఫ్ సర్టిఫికెట్లు అందించాలని పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షుడు కోసూరి రామరావు కోరారు. మంగళవారం ఇక్కడ జరిగిన పెన్షనర్ల దినోత్సవంలో మాట్లాడారు. పెన్షనర్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన డీఏ బకాయిలను వెంటనే ఇవ్వాలని కోరారు. అనంతరం పలువురు పెన్షనర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నూకరాజు, శేషగిరిరావు, రంగరాజు రమణ తదితరులు పాల్గొన్నారు.



నకరా చిత్రపటం వద్ద మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, సంఘం సభ్యులు నివాళి



చీడికాడలో పొలాల్లో కోసిన వరి చేను



మాడుగుల: ఎంకెవల్లాపురం వద్ద కుప్పలు పెడుతున్న రైతులు



రైతులకు అవగాహన కలిగిస్తున్న దేవరాపల్లి ఏవో

అన్నదాతల్లో అల్పపీడనం గుబులు

» వర్ష సూచనలతో ఆందోళన

» పంట దక్కించుకునేందుకు ఆపసోపాలు

మాడుగుల రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం హెచ్చరికతో అన్నదాత గుండెల్లో గుబులు పుడుతోంది. ఇప్పటికే వరుస తుపాన్లతో సతమవుతున్న రైతు మరో రెండు రోజుల్లో వర్షాలు మళ్లీ కురుస్తాయని వాతావరణ కేంద్రం చేసిన హెచ్చరికలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఓ వైపు వర్షాలు.. మరోవు తెగుళ్ల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాగుకి పెట్టిన పెట్టుబడులు కూడా రావడంలేదని వాపోతున్నారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 11వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇటీవల తుపాన్లకు భయపడి పంట కోతకు వచ్చినా కోసేందుకు సాహసం చేయలేదు. ఒరిగిన పంటను కట్టలు కట్టి ఏదోలా రక్షణ చర్యలు చేపట్టారు. ప్రస్తుతం చాలా మేరకు వరి పంట కోతకు వచ్చేసింది. దీంతో కోతలు పూర్తిచేసి వరిచేనుని ఆరబెడుతున్నారు. ఈ నేపథ్యంలో మరో రెండు రోజుల్లో వర్షాలు పడతాయనే హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఇప్పటివరకు సుమారు 3 వేల ఎకరాల్లో వరికోతలు పూర్తయినట్టు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి: ఏవో

మాడుగుల రూరల్: ప్రస్తుతం అల్పపీడనం ప్రభావం వల్ల వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో వాసుదేవరావు సూచించారు. మంగళవారం ఎం.కోడూరులలో పొలంపిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా కోసిన వరి పంటను కుప్పలుగా వేసి టార్పాలిన్లు కప్పాలని సూచించారు. సిబ్బంది లక్ష్మి, కమల రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

చీడికాడ: మండలంలో చీడికాడ, దిబ్బపాలెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు ఏవో ఎ.కృష్ణవేణి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగాఖండివరం, ఎల్‌బి. పట్నం గ్రా మాల్లో పొలాలను మంగళవారం పరిశీలించిన అ నంతరం ఆమె రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సర్పంచ్ శ్రీరంరెడ్డి లక్ష్మి, బండారు వెంకటలక్ష్మి, ఉపసర్పంచ్ కురచా నారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు. మంగళవారం ఉదయం నుంచి మబ్బులు కమ్ముకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో అన్నదాతలు పొలంబాటపట్టారు.

గొండుపాలెంలో పొలం పిలుస్తోంది

కె.కోటపాడు: మండలంలోని గొండుపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏవో సోమశేఖర్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలను కూడా వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు.

దేవరాపల్లి: మండలంలోని చినసోంపురం, బి.కింతాడ గ్రామాల్లో పొలంబడి కార్య క్రమం ఏవో ఎల్.వై. కాంతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా డిప్యూటీ గణాంక అధికారి జి.వైకుంటరావు పంట కోత తో ప్రయోజనాలను వివరించారు. డి.వరుణ్, రజనికుమార్, వాసు తది తరులు పాల్గొన్నారు.

డీ ఫారం ఫారెస్ట్ భూములకు పట్టాలివ్వాలి

చీడికాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డీ ఫారం ఫారెస్టు భూములకు ప్రభుత్వం వెంటనే పట్టాలివ్వాలని సీపీఎం జిల్లా నాయకులు గంటా శ్రీరామ్, ఆ పార్టీ మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు కోనాం సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సులో గిరిజన రైతులతో కలిసి వినతి ప త్రాన్ని తహసీల్దార్ వైవీఎస్ ప్రసాద్‌కి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పంచాయతీలో ఉన్న 16 గ్రామాల భూ సమస్యలు పరిష్కరించాలని, రీసర్వే చేసి భూమి ఎవరైతే సాగు చేస్తున్నారో వారికి పాస్‌పుస్తకాలు ఇవ్వాలని కోరారు. రైతులు చలుగు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతుల పేరిట సాగు నమోదు చేయాలి

కోనాం పంచాయతీ పరిధిలో గిరిజనులు భూములను సాగుచేస్తున్న వారిపేరున నమోదు చేయాలని ఏపీ ఆదివాసీ సంఘం గౌరవ సలహాదారుడు పీఎస్ అజయ్‌కుమార్ కోరారు. కోనాం సచివాలయం ఎదుట పంచాయతీ శివారు గ్రామాల గిరిజన రైతులు పెద్ద సంఖ్యలో మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీ పరిధిలో పలు ఆవాస గ్రామాలన్నాయని, ఆయా కుటుంబాలు తమకు అందుబాటులో ఉన్న భూములను తరతరాలుగా సాగుచేస్తున్నారని, కానీ వారి పేర్లను రెవెన్యూ అధికారులు రికార్డుల్లో నమోదు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘం ప్రతినిధులు జన్ని లక్ష్మణరావు, దయారావు, రాంబాబు, గమ్మెల చంటి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 28 అర్జీలు


రోలుగుంట: మండలంలోని అడ్డసరం గ్రామంలో మంగళవారం నిర్వహించి రెవెన్యూ సదస్సుల్లో 28 అర్జీలు వచ్చినట్లు డీటీ శంకరరావు తెలిపారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీటీ తెలిపారు. పరిష్కారం కాని భూసమస్యలపై సదస్సులో అర్జీలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామమూర్తి, వీఆర్వో లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పనసలపాడులోనే సదస్సు నిర్వహించాలి

రోలుగుంట: పనసలపాడులోనే రెవెన్యూ సదస్సును నిర్వహించాలని కోరుతూ మంగళవారం ఆ గ్రామ గిరిజనులు నిరసన చేపట్టారు. తమకు సంబంధం లేని రత్నంపేట గ్రామంలో నిర్వహిస్తే వెళ్లలేని పరిస్థితి నెలకుందన్నారు. గతంలో నిర్వహించిన రీసర్వేలో చాలా ఏళ్ల నుంచి తాముసాగుచేసుకుంటున్న భూములకు గిరిజనేతరులకు పట్టాలు ఇచ్చారని, వీటిని తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఈ నెల 23న నిర్వహించే రెవెన్యూ సదస్సును తమ గ్రామంలోనే నిర్వహించి అర్జీలు స్వీకరించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గెమ్మెలి చినబ్బాయి, వి.నాగరాజు, గెమ్మెలి నూకినాయుడు పాల్గొన్నారు.



కోనాం సచివాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజనులు



పనసలపాడులో నిరసన తెలుపుతున్న గిరిజనులు

భూములకు సరిహద్దులు గుర్తించండి

దేవరాపల్లి: మండలంలోని చింతలపూడి, తామరబ్బ పంచాయతీలో గిరిజనులు సాగు భూములు సరిహద్దుల నిర్ధారణ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ లక్ష్మీదేవికి గిరిజనులు ఫిర్యాదు చేశారు. ఈ కార్య క్రమంలో మొసలి పైడిరాజు, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కారం



కొమిరలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

గొలుగొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమిరలో తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటిగైరంపేట, కొమిర, రావణాపల్లి గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యలపై పలువురు రైతులు అర్జీలను సమర్పించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారానికి ఇటువంటి సదస్సులు దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఛైనులు, స్థానిక సర్పంచ్ రాజు, నాయకులు కొల్లి సత్యనారాయణ, కర్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి



వాహనాల రికార్డులు తనిఖీ చేస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్సుతో పాటు అన్ని రికార్డులు విధిగా ఉండాలని నర్సీపట్నం మోటర్ వెహికల్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీఆర్ మూర్తి స్పష్టం చేశారు. గొలుగొండ- కృష్ణాదేవిపేట రహదారిలో మంగళవారం ఆయన వాహన తనిఖీలు చేపట్టి, పత్రాలు లేని పలువురిపై కేసులు నమోదు చేశారు. కృష్ణాదేవిపేటలో మూడు బైక్‌లు, రెండు ఆటోలు, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తలిరంచారు. అనంతరం కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద ఆటో, వ్యాన్ల డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు.

వైసీపీ నుంచి బీజేపీలో చేరిక

నాతవరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుమ్మిడిగొండకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం నర్సీపట్నం అసెంబ్లీ కన్వీనర్ తమరాన ఎర్రనాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు చుక్కల రాంబాబు ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వీరికి సదరు నాయకులు కండువాలు కప్పి ఆహ్వానించారు. వైసీపీ నుంచి బీజేపీలో చేరినవారిలో అడిగర్ల బాపినాయుడు, రావాడ రాజుబాబు, లక్కోజు రామకృష్ణ, జీరెడ్డి శివాజీ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వెలగా జగన్నాథం, పాకలపాటి అరవింద్ రాజు, పేరూరి బుల్లిదొర, వానపల్లి భవానీ రుషిత తదితరులు పాల్గొన్నారు.

'కోళ్ల వ్యర్థాల తరలింపును అడ్డుకోవాలి'

దేవరాపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చేపల మేతకు తరలిస్తున్న కోళ్ల వ్యర్థాలు అడ్డుకోవడంతో అధి కారులు విఫలమవుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డివెంకన్న ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పెంటలో చేపలు వ్యర్థాలు తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకుని మత్స్యశాఖ, పోలీసులకు అప్పగించామన్నారు. అయినా, కేసులు నమోదు చేయడం లేదని ఆరోపించారు.

ఘనంగా అయ్యప్ప పూజ



వీరవిల్లి లో అయ్యప్ప అంబలం పూజ నిర్వహిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్, డిశెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీరవిల్లి అగ్రహారంలో సోమవారం రాత్రి అయ్యప్ప అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. స్థానిక మాలధారణ చేసిన భక్తులు ఆధ్వర్యంలో పద్దెనిమిది మెట్లతో అయ్యప్పస్వామి గుడి ఇతర త్రా సెట్టింగులతో ఎంతో ఘనంగా అలంకరించారు. స్వామికి పూజలు చేశారు.

పేకాటరాయుళ్లు అరెస్టు



పేకాటరాయుళ్లతో ఎస్ఐ రామకృష్ణారావు

రోలుగుంట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలంకాయలపాలెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. సమాచారంపై సిబ్బందితో కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్టు చేసినట్టు చెప్పారు. వారినుంచి రూ. 18.200 స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

చీడికాడ: ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు సమకూరుతాయని మండల ఉద్యానవనశాఖ అధికారి కిరణ్మయి అన్నారు. మండలంలో కోనాంలో ఉ ద్యాన శాఖ, ఆయిల్‌పామ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులతో మంగళవారం అ వగాహన సదస్సు జరిగింది. ఆయిల్‌పామ్ కంపెనీ జోనల్ మేనేజర్ జోషికిరణ్ , సర్పంచ్ చలుగు ఈశ్వరమ్మ, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మన ఊరు- మన కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో కబడ్డీ ఆడుతున్న మహిళలు

సీలేరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో మంగళవారం మన ఊరు- మన కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంను బాలీజీ అండ్ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆంధ్రా- ఒడిశా సరిహద్దుల్లో సీలేరు నది ఒడ్డున నిర్వహించిన ఈ సమ్మేళనంలో 300 మందికి పైగా స్థానికులు పాల్గొని ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా మహిళలకు మ్యూజికల్ చైర్, క్విజ్, కబడ్డీ తదితర పోటీలను నిర్వహించారు. అనంతరం పలువురు చిన్నారులు, పె ద్దలు ప్రదర్శించిన డ్యాన్స్ అలరిం చింది.

104 ఉద్యోగులపై ఎస్మా ఉపసంహరించాలి



ఎంపీపీకి వినతిపత్రాన్ని అందిస్తున్న 104 సిబ్బంది

పెదబయలు, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 104 ఉద్యోగులపై విధించిన ఎస్మా చట్టాన్ని తొలగించాలని అల్లూరి జిల్లా 104 యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ సూర్యనారాయణ, సభ్యుడు అజీత్ కువార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తమ విధినిర్వహణ అనంతరం సమస్యలపై ఉద్యోగులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొండా వరహాలమ్మ, వైస్ ఎంపీపీ కొర్ర రాజుబాబుకు వినతి పత్రాలను ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ, న్యాయమైన డిమాండ్‌లపై శాంతియుతంగా నిరసనలు చేపడుతున్న తమపై ఎస్మా ప్రయోగించటం భావ్యం కాదని ఆవేదన వ్యక్తంచేశారు. బకాయి వేతనాలను చెల్లించకపోవటంతో కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్నామన్నారు. 104 సేవలను ప్రభుత్వం పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలన్నారు. వాహన డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జీవో 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు.అరబిందో యాజమాన్యం నిర్లక్ష్యంతో వదిలేసిన ఇంక్రిమెంట్‌లు. ఏరియర్స్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు నోటీసులు

అనంతగిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపట్నం వద్ద అరకు-విశాఖ ప్రధాన రహదారిని ఆనుకుని చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటుతో ట్రాఫిక్ అంతరాయం నెలకొంటోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు.. కార్యదర్శి లావణ్య చిరువ్యాపారులకు నోటీసులను జారీ చేశారు. చిరువ్యాపారులకు ముందుగా అవగాహన కల్పించి, ట్రాఫిక్ నియంత్రణంలో భాగంగా చర్యలు చేపడతామని ఆమె తెలిపారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు సమష్టి కృషి

ఏపీఎస్ఐఆర్‌డీ డీడీ మధుసుదనరావు



మాట్లాడుతున్న మధుసూదనరావు

చింతపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు ఉద్యోగులు సమష్టిగా పనిచేయాలని ఏపీ ఎస్ ఐఆర్‌డీ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదనరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయం ఉద్యోగులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ పేదరికంలేని మెరుగైన జీవనోపాధి, ఆరోగ్యకరం, బాలల స్నేహం, నీరు సమృద్ధి, పరిశుభ్రత, హరిత, స్వయం సమృద్ధి తదితర తొమ్మిది లక్ష్యాలను ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో జిల్లా ట్రైనింగ్ మేనేజర్ చిన్నారావు, ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోడి పందాల శిబిరంపై పోలీసుల దాడి

ఆరుగురి అరెస్టు, 8 కోడి పుంజులు, రూ. 11, 600 స్వాధీనం



నిందితులతో పోలీసులు

సీలేరు, డిసెంబరు 17 : జీకేవీధి మండలం ధారకొండ సమీపంలో అటవీప్రాంతం నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. పక్కా సమాచారం మేరకు తమ సిబ్బందితో వెళ్లి దాడి చేసి కోడి పందేలు ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి 8 కోడి పుంజులు, రూ. 11, 600ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసామని ఎస్‌ఐ వివరించారు.

విద్యార్థి అదృశ్యం



అదృశ్యమైన మనోజ్ తేజ్ (ఫైల్)

కొయ్యూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) మండలంలో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతూ గత శనివారం రాత్రి నుంచి వంతల మనోజ్ తేజ్ (బాబులు) అనే విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ మేరకు ప్రిన్సిపాల్ మోహన్‌తో పాటు సిబ్బంది విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారమిచ్చి స్థానిక పోలీసులకు పిర్యాదు చేశారు. ఆ విద్యార్థి ఆచూకీ తెలిసేత ఫోన్: 94409 04241కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కిషోర్ వర్మ కోరారు.

రహదారి సరే...బస్సులు ఏవీ

- లక్ష్మీపురం ప్రధాన రోడ్డు నిర్మించి పదేళ్లు పూర్తి
- అయినా, నడవని ఆర్టీసీ సర్వీసులు
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు



బస్సులేక కాలినడకన వెలుతున్న లక్ష్మీపురం ప్రాంత మహిళలు

ముంచంగిపుట్టు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి లబ్బూరు జంక్షన్ నుంచి లక్ష్మీపురం వరకు సుమారు రూ. 7 కోట్లు వెచ్చించి పదేళ్ల కిందట రహదారిని ని ర్మించారు. అయితే, నేటికీ ఆ మార్గంలో ఆర్టీసీ బస్సు సర్వీసును అధికారులు నడపలేదు. దీంతో పక్కా రహదారి ఉన్నా ఆశించిన స్థాయిలో ఉపయోగపడటంలేదని ఆ ప్రాంతీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చక్కటి రోడ్డు కోట్లు వెచ్చించి నిర్మించినా సంబంధిత ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులను నడిపేందుకు కనీస దృష్టిసారించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. రహదారి పనులు పూర్తయిన తొలినాళ్లలో అటుగా పా డేరు ఆర్టీసీ డిపోనకు చెందిన బస్సును ట్రైలరన్‌గా నడిపారు. అయితే, అయితే, ఆ మార్గంలో పలు చోట్ల హె యిర్ పిన్ బెండ్‌ను తలపించే విధంగా మలుపులు ఉన్నట్లు ఆర్టీసీ అధికారులు గుర్తించారు. ఈ మలుపుల్లో ఆర్టీసీ బస్సు అటుగా తిప్పడం కష్టమంటూ బస్సు సర్వీసులపై చేతులు ఎత్తేశారు. అయితే, బస్సు నడిపేందుకు అవసరమైన విధంగా మలుపుల వద్ద రహదారిని వెడల్పు చేయాల్సి ఉంది. కానీ ఏళ్లు కావస్తున్నా అధికారులు ఆ దిశగా కనీసం దృష్టి సారించలేదు. దీంతో కోట్లాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన నూతన రహదారి అలం కార ప్రాయంగా మారింది. ప్రస్తుతం అటుగా ప్రైవేటు వాహనాలు తిరుగుతున్నాయి. పలు సందర్భాల్లో పరిమితికిమించి ప్రయాణికులు ఎక్కడంతో ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు గిరిజనులు మృతి చెందారు. పదుల సంఖ్యలో ఆసుపత్రి పాలైన సంఘటనలు ఉన్నాయి. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా, వివిధ పనుల ని మిత్తం మండల కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాలకు, వారపు సంతలకు వెళ్లేందుకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించడక తప్పడంలేదని ఆ ప్రాంతీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో సుమారు నాలుగు పంచాయతీలకు సంబంధించి ప్రజలు రవాణా కష్టాలు తీరుతాయనుకున్న ఆశలు అడిఆశలుగానే మిగిలిపోయింది. ఈ మార్గంలో పెనుప్రమాదాలు జరగకముందే అధికారులు ఆర్టీసీ బస్సు సర్వీసులు తిరిగే విధంగా చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

బస్సులు నడపకుంటే ఆందోళన చేపడతాం



లక్ష్మీపురం వైపు ఆర్టీసీ బస్సు సర్వీసును నడపాలని అధికారులకు ఎన్నిసార్లు వినతులందించినా పట్టించుకోవడంలేదు. గత్యంతరంలేక ప్రైవేటు వాహనాల్లో రాకపోకలు సాగిస్తున్నాం. పలు సందర్భాల్లో ఆ వాహనాలు ప్ర మాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికే ఈ మార్గంలో వా హన ప్రమాదాల్లో సుమారు ఆరుగురు మృతి చెందగా, పదుల సంఖ్యలో ఆసుపత్రి పాలయ్యారు. అటుగా బస్సు సర్వీసును నడపకపోతే ఆందోళన బాట పడతాం.

- కె. త్రినాథ్, లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవ సోదరులు

పాడేరురూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మెగా క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూసీవైఏ ఫౌండేషన్ చీఫ్ రీమాలి జాన్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు రాజమండ్రి హోసన్నా మినిస్ట్రీస్ నుంచి అంతర్జాతీయ ప్రసంగికులు, సింగర్, పాస్టర్ జాన్ వెస్లీ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ క్షమాగుణం, పరిశుద్ధత కలిగి జీవించాలన్నారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ క్రైస్తవ గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ అన్ని మతాలను గౌరవించాలన్నారు. ఏటా క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో బి.రవిప్రసాద్, ఒ. శామ్యూల్, పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాల పాస్టర్స్, పెలోషిప్ నాయకులు, యూసీవైఏ నాయకులు బి.ఎలీషారావు, చిన్ని, సైమన్, సత్యారావు, స్టీవెన్ శ్రీనివాస్, రవి, అరుణ, సంజీవ్, గ్లోరియస్, రాకేష్, ఓ.జ్ఞానప్రకాష్, వివిధ చర్చిల నుంచి 3 వేల మంది సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యానికి సత్వర చెల్లింపులు



కళ్లం వద్దనే ధాన్యం కొనుగోలు చేస్తున్న ఏవో, తదితర సిబ్బంది

కొయ్యూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యానికి రెండు రోజుల వ్యవధిలోనే ఆయా రైతు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్టు మండల వ్యవసాయ శాఖాధికారిణి ఉమాదేవి తెలిపారు. మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఏవో ఎం. మాకవరం రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి సిబ్బందితో కలసి నేరుగా కళ్లాల వద్దనే ధాన్యం కొనుగోలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు ఇప్పటికే ఐదుగురుకు వారి ఖాతాలకు నగదు జమ చేసినట్టు వివరించారు. నూర్పులు చేసి అమ్మకాలకు సిద్ధం చేసిన ధాన్యాన్ని సమీప కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు.

రాజ్‌మా సాగులో సస్య రక్షణ చర్యలు తప్పనిసరి

జి.మాడుగుల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాజ్‌మా సాగులో సస్య రక్షణ చర్యలు తప్పక పాటించాలని ఏ రువాక కేంద్రం శాస్త్రవేత్త డా. ప్రదీప్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలో గురువారం రాజ్‌మా సాగును పరిశీలించారు. రాజ్‌మా సాగులో రసం పీల్చు పురుగుల ఉత్పత్తిని గమనించారు. వాటి నివారణకు వేపనూనే పిచికారి చేసుకోవాలని సూచనలు చేశారు. అలాగే పసుపు జ రుగు అట్టలపైన డెమోన్‌స్ట్రేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లకే పాత్రుడు, వీఏఏలు, విహెచ్‌ఏ, ఎంపీఈవో సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి: ఎమ్మెల్యే



ఉప్ప ఆరోగ్య కేంద్రంలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్యలింగం

హుకుంపేట డిసెంబరు 17 ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల విద్యా ప్రమాణాల మరింత మెరుగుపరచాలని అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కోరారు. మంగళవారం మండలంలోని బోడ్డపుట్టులోరి గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల బోధనను పరిశీలించారు. పిల్లలకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పాఠశాల రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనాలు అందించాలన్నారు. పట్టం పంచాయతీ డబవలస సమీపంలో ఉన్న వంతెనకు తుఫాన్‌కు ధ్వంసమైందని స్థానికులు ఫిర్యాదు మేరకు ఆయన దానిని పరిశీలించారు. కలెక్టర్, పీవోలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అనంతరం ఉప్ప ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వైద్య సేవలు అందుతున్న తీరును రోగుల నుంచి అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోడ్డపుట్టు హెచ్ఎం పద్మ, ఉప్ప హెచ్ఎం సన్యాసిరావు, ఉపాధ్యాయులు సాగరి రాజారావు, చైతన్య రవణమ్మ వైద్యాధికారి సౌజన్య ప్రతాప్, రేఖ తదితరులున్నారు.

ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం



పెన్షన్ల ఉద్యమకారుడు నకరాకు నివాళులర్పిస్తున్న నాయకులు

పాడేరురూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పాడేరులోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో అఖిల భారత విశ్రాంతి ఉద్యోగుల దినోత్సవాలన్ని విశ్రాంతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, రిటైర్డ్ ఏటీవో ఆర్.నాగభూషణంరాజు, రిటైర్డ్ ఎస్‌డీసీ టి.అప్పారావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పెన్షనర్ల ఉద్యమకారుడు డీఎస్ నకరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అ ర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రభుత్వ విశ్రాంత ఉ ద్యోగుల పెన్షన్ సాధనకు నకారా విశేష కృషి చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంతి ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికేట్‌లు ఆన్‌లైన్‌లో జీవన్ ప్రమాన్ పోర్టల్ ద్వారా వచ్చే జనవరి నుంచి ఫిబ్రవరిలోగా సంబంధిత ఉప ఖజానా కార్యాలయాలకు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీనియర్ పెన్షన్ దారులకు ఘన సన్మానం

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఆల్ ఇండియ పెన్షనర్స్ డే సందర్భంగా మంగళవారం సీనియర్ పెన్షర్లు ఎస్.సన్యాసిరావు, వి.కొండడు, ఎస్.గున్నయ్యలను ఘనంగా సన్మానించారు. అలాగే పెన్షనర్ల ఆరాధ్యుడు డీఎస్.నకర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్య క్రమంలో పెన్షనర్ల యూనియన్ ప్రతినిధులు సీహెచ్.ప్రసాదరావు, ఎ.రామానుజులు, జి.మోహన్, ఎస్.కామేశ్వరరావు, కె.రాజారావు, వి.నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

- ఐసీడీఎస్ పీడీ సూర్యకుమారి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ సూర్యకుమారి

కొయ్యూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, నిరక్షరాస్యతపై గ్రామ స్థాయి నుంచి అవగాహన కల్పనపై జీఎంఎస్‌కేలు దృష్టి సారించాలని ఐసీడీఎస్ పీడీ సూర్యకుమారి కోరారు. మంగళవారం స్థానిక సీడీపీవో అధ్యక్షతన స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో కిశోర వికాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల పిల్లలను కిశోర బాల, బాలికలంటారన్నారు. వీరికి అవగాహన కల్పించి బాల్య వివాహాలను నిర్మూలించాలన్నారు. ఇందుకు వీలుగా గ్రామస్థాయిలో సర్పంచ్ చైర్మన్‌గా పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్, వీఆర్వోలతో కూడిన జీఎంఎస్‌కే కమిటీలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కమిటీలు బాల్య వివాహాలపై అనర్థాలను వివరిస్తూ గ్రామాల్లో తల్లిదం డ్రులకు అవగాహన కల్పించాలన్నారు. చిన్న వయసులో పెళ్లిళ్లు చేస్తే పిల్లలు రక్తహీనతతో పుడతారన్నారు. అనంతరం ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు, ఎంపీడీవో ప్రసాద్, ఎంఈవో రాంబాబు, మంప ఎస్‌ఐ శంకరావు, వెలుగు ఏపీఎం సాధన రాజేంద్రపాలెం సర్పంచ్ సింహాచలం మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు చేయటం చట్ట రీత్యా నేరమని, ఇందుకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

182 మంది గిరిజనులకు వైద్య పరీక్షలు



చిన్నారికి వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యాధికారి హిమబిందు

సీలేరు, డిసెంబరు 17, (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని డీ కొత్తూరు, పెంట్లగెడ్డ గ్రామాల్లో వైద్యాధికారి డీకే హిమబిందు ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరంను నిర్వహించారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గిరిజనులకు అవగాహన కల్పించారు. రెండు గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో 182 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. పెంట్లగెడ్డలో తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న బాలుడికి ఆరోగ్య పరీక్షలను నిర్వహించి మెరుగైన వైద్య పరీక్షల కోసం పీహెచ్‌సీకి తరలించారు. అతిసారం, జలుబు, దగ్గు, చర్మ సంబంధమైన వ్యాధులు సోకితే వెంటనే ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకోవాలని, నాటు వైద్యానికి దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు ఈశ్వరి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఆధార్ నమోదు సద్వినియోగం చేసుకోవాలి:ఎంపీడీవో



ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటుచేస్తున్న ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఆదివాసీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వై.ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం పూజారిపాకలు గ్రామంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక ఆధార్ కేంద్రాన్ని సీడీపీవో లక్ష్మీదేవితో కలిసి ఎంపీడీవో తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పూజారిపాకలు, రింతాడ-2లో తాత్కాలిక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఐదేళ్లలోపు చిన్నారుల ఆధార్ నమోదు, ఇతరులకు ఆధార్ నవీకరణలను చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు.

ఆదివాసీల ఇసుక సేకరణపై ఆంక్షలు తగవు



అటవీశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజనులు, టీడీపీ నేతలు

చింతపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఇసుక సేకరణపై అటవీశాఖ అధికారుల ఆంక్షలు తగదని, కలెక్టర్ జోక్యం చేసుకుని వీటిని తొలగించాలని టీడీపీ సీనియర్ నేత, లోతుగెడ్డ సర్పంచ్ చింతర్ల సునీల్ డిమాండ్ చేశారు. మంగళవారం గిరిజనులు అటవీశాఖ అధికారుల వైఖరిపై డివిజన్ ఫారెస్టు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ మండలంలోని ఆదివాసీలు కొన్నేళ్లుగా లోతుగెడ్డ, పిసిరిమామిడి, చెరుకుంపాకలు, లింగాలగుడి, కోటకొండ, పొలంబంద గ్రామాల సమీపంలో నున్న వాగుల నుంచి ఇసుకను సేకరించి గృహాలు నిర్మించుకుంటున్నారన్నారు. ప్రభుత్వ భవనాలు, డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణానికి ఇదే ఇసుకను వినియోగిస్తున్నారన్నారు. గిరిజనులు సేకరిస్తున్న ఇసుక ప్రాంతాలు రిజర్వుడ్ ఫారెస్టు పరిధిలో లేవన్నారు. అయినా, అటవీశాఖ అధికారులు గిరిజనులు సేకరించిన ఇసుకను అడ్డుకుంటున్నారన్నారు. ఐదు రోజుల కిందట ఇసుక తరలిస్తున్న రెండు వ్యాన్లు లోతుగెడ్డ రేంజ్ అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకుని ఇప్పటికీ విడిచిపెట్టలేదన్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక ప్రకటించినా అటవీశాఖ అధికారుల ఆంక్షల వల్ల ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. పీఎం జన్‌మన్ పక్కా గృహ నిర్మాణాలు నిలిపివేశారన్నారు. ఇకనైనా ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్ స్పందించి ఆదివాసీలు ఇసుక సేకరణకు అనుమతించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రాబు బాబూరావు, మాజీ ఎంపీపీ వంతల బాబురావు, ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు ఒడిశా ఉప ముఖ్యమంత్రి అరకులోయ రాక

అరకులోయ, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): అరకులోయకు నేడు ఒడిశా ముఖ్యమం త్రి విచ్చేయనున్నట్టు పాడేరు డీపీఆర్‌వో మంగళవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు హెలికాప్టర్‌లో అరకులోయకు చేరుకుంటారు. అరకులోయ నుంచి సుంకరమెట్ట కాఫీతోటలను సందర్శిస్తారు. అనంతరం గిరిగ్రామదర్శిని, ట్రైబల్‌మ్యూజియంను సందర్శించనున్నట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న హెలీప్యాడ్‌ను స్థానిక గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు అభిశేక్,రూబేన్ హెలీప్యాడ్‌ను సిద్ధం చేశారు.

అడాకుల గ్రామ సభ రద్దు చేయాలి: ఆదివాసీ జేఏసీ

పాడేరురూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం అడాకుల గ్రామంలో ఈ నెల 19వ తేదీన తహసీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గ్రామ సభను రద్దు చేయాలని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రమిచ్చినట్టు ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడాకుల గ్రామంలో ఏర్పాటు చేయనున్న గ్రామ సభ పెసా నియామకాలకు విరుద్ధంగా ఉందన్నారు. ఆదివాసేతరులకు భూమి పట్టాలిచ్చేందుకే ఈ సభను నిర్వహిస్తున్నారన్నారు. పెసా గ్రామసభ కార్యదర్శి, ఉపాధ్యక్షులను సంప్రదించకుండా తహసీల్దార్ నోటీసు జారీ చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు బోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

పాడేరురూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వంజంగి త్రినాథరావు నాయుడు కోరారు. మంగళవారం మండలంలోని డి.గొందూరు, కాడెలి పంచాయతీ కేంద్రాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలు, భూ ఆక్రమణలు, సరిహద్దుల సమస్యలు, మ్యుటేషన్‌ల సమస్యల పరిష్కారానికి ఈ రెండు పంచాయతీల్లో 103 పిర్యాదు అందాయన్నారు. డి.గొందూరులో 55, కాడెలిలో 48 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించామన్నారు. ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, డి.గొందూరు సర్పంచ్ సీదరి రాంబాబు, కాడెలి సర్పంచ్ వనుగు బసవన్నదొర, లగిశపల్లి సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యుడు లకే రామకృష్ణ పాత్రుడు, డిప్యూటీ తహసీల్దార్ పి.పోలురాజు, ఎలక్షన్ డీటీ కె.లక్ష్మణమూర్తి, మండల సర్వేయర్ వి.భీమయ్య, వీఆర్‌వోలు కె.పద్మావతి, జె.వెంకటలక్ష్మి, జి.రవికుమార్, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కొయ్యూరులో..

కొయ్యూరు: గిరిజన ప్రాంతంలో భూ సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు ప్రసాద్ తెలిపారు. మంగళవారం మంప పంచాయతీలో ఎంపీపీ బడుగు రమేష్‌బాబు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా భూ సంబంధిత సమస్యలపై 61 వినతులు స్వీకరించారు. వీటిలో ఎఫ్ లైన్‌కు సంబంధించి 2, మ్యుటేషన్‌లు 51, డీ పట్టాలకు గానూ 5, వెబ్ ల్యాండ్‌లో యాడింగ్‌కు 3 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీటీ కుమార్ స్వామి, రీ సర్వే డీటీ అప్పన్న, ఆర్ఐ రాజా నదిరా, సర్వేయర్, వీఆర్‌వో, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్

డుంబ్రిగుడ: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రత్యేక అధికారి నందు అన్నారు. మండలంలోని కించుమండ, కుసుమవలస సోవ్వా, కోరంజిగుడ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గిరిజనులకు ఈ రెవెన్యూ ఎంతో ఉపయోగమన్నారు. అయితే, ప్రచారం లేకపోవడంతో ఈ సదస్సులకుహాజరుకాలేకపోతున్నట్టు పలువురు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

భూ పత్రాల మార్పుకు మ్యూటేషన్ తప్పనిసరి:తహసీల్దార్

గూడెంకొత్తవీధి: భూపత్రాలు మార్పుకు మ్యూటేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని తహసీల్దార్ టి.రామకృష్ణ అన్నారు. మంగళవారం సంకాడ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. పట్టాదారుడు మర ణిస్తే భార్య, కుటుంబ వారసుల పేరిట భూపత్రాలు మార్పుకునేందుకు మ్యూటేషన్ చేయించుకోవాలన్నారు. పట్టామార్పిడి వల్ల ప్రభుత్వ పరంగా రైతుభరోసా, రాయితీ రుణాలు, విత్తనాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మహదేవ్, వీఆర్వో తరుణ్, సీనియర్ అసిస్టెంట్ చిన్నయ్యపడాల్ పాల్గొన్నారు.



కాడెలిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ త్రినాధరావునాయుడు

ముంచంగిపుట్టు: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చివుకుచింత సర్పంచ్ పి.పాండురంగ స్వామి అన్నారు. గ్రామంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారులు అలాగే పలు భూ సమస్యలపై వినతులను స్వీకరించారు.

ముత్యాలమ్మపాలెం బీచ్‌ను
పర్యాటకంగా అభివృద్ధి చేయండి

కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖా మంత్రిని కోరిన ఎంపీ సీఎం రమేశ్


కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్‌ను కలిసిన ఎంపీ సీఎం రమేశ్

పరవాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఇక్కడి ముత్యాలమ్మపాలెం తీరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు సీఎం రమేశ్ కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖా మంత్రి గజేంద్ర షెకావత్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. పర్యాటకులతో రద్దీగా ఉండే ముత్యాలమ్మపాలెం తీరం అభివృద్ధికి నోచుకోలేదని, దీనివల్ల పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించారు. సినిమా షూటింగ్‌లకు కూడా తీరం ఎంతోఅనువుగా ఉంటుందని తెలిపారు. పర్యాటకంగా అభివృద్ధి చెందితే స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మంత్రి ముత్యాలమ్మపాలెం తీరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్టు ఎంపీ రమేశ్ ఇక్కడి విలేకరులకు వెల్లడించారు.

బకాయి వేతనాల కోసం పారిశుధ్య కార్మికులు ధర్నా


జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బకాయిపడిన వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలను వెంటనే ఇవ్వాలన్నారు. జీవీఎంసీ అధికారులు వెంటనే స్పందించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యర్రంశెట్టి శివ, నిమ్మకాయల అజయ్, యర్రంశెట్టి ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని వినతి


చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతి అందిస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

సబ్బవరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరుతూ ఉత్తరాంధ్ర జిల్లాల ఎంఆర్‌పీఎస్ రీజనల్ కో-ఆర్డినేటర్ ఐ.దేముడుబాబు ఆధ్వర్యంలో పలువురు ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు మంగళవారం విజయనగరంలో వినతి పత్రం అందజేశారు. మాదిగ, 59 ఉప కులాల తరఫున రాష్ట్ర యూనిట్‌గా ఎ,బి,సి,డిగా వర్గీకరణ చేయాలని కమిషన్ చైర్మన్‌ను కోరినట్టు దేముడుబాబు ఇక్కడి విలేకరులకు తెలియజేశారు. జిల్లా యూనిట్‌గా వర్గీకరణ చేయడం వలన కొన్ని ఉప కులాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. వెంటనే ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని కోరినట్టు వివరించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పల్లకీ ఊరేగింపు


నర్సింగబిల్లిలో పల్లకీ ఊరేగింపు నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

కశింకోట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నర్సింగబిల్లిలో అయ్యప్పస్వామి పల్లకీ ఊరేగింపును మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చింతలపాలెం, జట్టపురెడ్డితుని, నర్సింగబిల్లి గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులు స్వామి శరణ ఘోష చెపుతూ ఆయా గ్రామాల పురవీధుల గుండా ముందుకు సాగారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

'విద్యుత్ ఆదా చేస్తే ఉత్పత్తి చేసినట్లే'

అనకాపల్లి టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌ను ఆదా చేస్తే ఉత్పత్తి చేసినట్లేనని ఈపీడీసీఎల్ రిటైర్డు ఎస్ఈ కేవీ రమణారావు పేర్కొన్నారు. డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం విద్యుత్ పొదుపుపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. విద్యుత్ చాలా విలువైనదన్నారు. దానిని వృథా చేయకుండా ఆదా చేయడం ద్వారా సహజ వనరులను కాపాడుకోవచ్చునని సూచించారు. అనంతరం కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ విద్యుత్, ఇంధనాన్ని పొదుపుగా వినియోగించడం ద్వారా సహజ వనరులపై ఒత్తిడిని తగ్గించ వచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీవీ రామారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ గణేష్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికోద్యమ నేత శారదకు ఘన నివాళులు


అనకాపల్లిలో శారద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం శ్రేణులు

అనకాపల్లి టౌన్/కశింకోట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సీపీఎం కార్యాలయంలో కార్మికోద్యమ నేత డి.శారద వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీనియర్ నాయకుడు జి.నాయనబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యలపై ఆమె చేసిన పోరాటాన్ని కీర్తించారు. నాయకులు కర్రి అప్పారావు, కె.తేలయ్యబాబు, బి.ఉమామహేశ్వరరావు, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కశింకోటలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ, ఐద్వా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, డి.డి.వరలక్ష్మి, తనూజ, శ్యామల తదితరులు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు అవగాహన అవసరం

▸▸ జిల్లా పోలీస్ సిబ్బంది శిక్షణ శిబిరంలో ఎస్పీ తుహిన్ సిన్హా



శిక్షణకు హాజరైన పోలీస్ సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, చిత్రంలో పరిశ్రమల ప్రతినిధులు

పరవాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని నివారించేందుకు తప్పనిసరిగా అవగాహన అవసరమని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా అన్నారు. ఇక్కడి ఫార్మాసిటీలోని ఎంఎస్ఆర్ఎం ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం జిల్లా పోలీస్ సిబ్బందికి 'రిస్క్ ఎసెస్‌మెంట్ ప్రివినేషన్- మిటిగేషన్ ఇండస్ట్రియల్ సేఫ్టీ' పై మంగళవారం శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోలీస్ సిబ్బందికి కూడా ప్రమాదాల నివారణపై అవగాహన అవసరమని వివరించారు. ఇందుకోసమే పోలీస్ సిబ్బందికి మూడు రోజులపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లారస్ ల్యాబ్స్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ఎస్‌రావు, సేఫ్టీ ప్రతినిధి ఎం.శ్రీనివాసరావు పోలీస్ సిబ్బందికి పలు విషయాలు తెలియజేశారు. పరిశ్రమల తనిఖీ అధికారి జేవీఎస్ నారాయణరావు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం


అనకాపల్లిలో రిటైర్డు టీచర్ సత్యనారాయణను సత్కరిస్తున్న ప్రతినిధులు


కశింకోట మండలం బయ్యవరంలో...

అనకాపల్లి టౌన్/ కశింకోట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పింఛనుదారుల దినోత్సవాన్ని అనకాపల్లి, కశింకోట మండలం బయ్యవరంలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి రింగురోడ్డులో జరిగిన ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బుద్ద కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ డీఎస్ నకారా ఆశయాలు మనందరికీ ఆచరణీయమన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు సకాలంలో పెన్షన్ పొందుతూ ప్రశాంత జీవనం గడపడం వెనుక నకారా చేసిన కృషి గొప్పదన్నారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు కాండ్రేగుల సత్యనారాయణను సత్కరించారు. అసోసియేషన్ ప్రతినిధులు కె.గౌరీపతి, బుద్ద అప్పారావు, ఎస్.మన్మథరావు, రిటైర్డు తహసీల్దార్లు పి.వీరభద్రరావు, ఎగంగాధరరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, కశింకోట మండలం బయ్యవరంలో పింఛనుదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. అసోసియేషన్ మండల అధ్యక్షుడు పాము సూర్యనారాయణ తొలుత పెన్షన్ పితామహుడు డీఎస్ నకరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. అనంతరం పెన్షన్‌దారులకు పలు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యదర్శి కె.గోపాలరావు, ప్రతినిధులు డీవీఎస్ఆర్ మూర్తి, ఏఎస్ఐ వానపల్లి సత్యారావు, డీవీఎస్ఎన్ సత్యనారాయణమూర్తి, కామేశ్వరి, నంబా రమణ, సోమేశ్వరరావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విశ్రాంతి ఉద్యోగులను సత్కరించారు.

సింహాద్రి నాలుగో యూనిట్‌లో ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం(ఎన్టీపీసీ)లో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్‌లో ఉత్పత్తిని మంగళవారం తెల్లవారుజామున పునరుద్ధరించారు. ఈ యూనిట్ బాయిలర్ ట్యూబులకు రంధ్రాలు ఏర్పడడంతో శనివారం అర్ధరాత్రి ఉత్పత్తి నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి మూడు రోజుల్లో ఉత్పత్తిని పునరుద్ధరించారు. కాగా వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌ను గత నెలలో షట్‌డౌన్ చేశారు. ప్రస్తుతం మిగిలిన మూడు యూనిట్‌లలో పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నదని అధికారులు తెలిపారు.

సంతోషిమాత ఆలయ హుండీ లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న కమిటీ సభ్యుల

అనకాపల్లి టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం సంతోషిమాత ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం నిర్వహించారు. 93 రోజులకు గాను రూ.51,656 భక్తుల కానుకల రూపంలో లభించింది. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ డి.వసంత్ పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపులో ఈవో రాజ సులోచన, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మారిశెట్టి భాస్కరరావు, సభ్యులు బుద్ద ఈశ్వరరావు, ఆళ్ల రవికుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలు విజయవంతం చేయండి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాణిక్యం తదితరులు

పరవాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నర్సీపట్నంలో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం మహా సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల నాయకురాలు పి.మాణిక్యం పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఇక్కడ ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలోని వివిధ సమస్యలపై మహాసభల్లో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైలా నాయుడు, వర్రి సన్యాసిరావు, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి'

పరవాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెంలలో జీవీఎంసీ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నాయకులు జాజుల చిన్నారావు, చిత్తా మధు, లక్కరాజు ప్రకాశ్, శ్రీను పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ముందస్తు ప్రణాళికలు

▸▸ సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగుల శిక్షణ శిబిరంలో అధికారులు, ప్రజాప్రతినిధులు



పరవాడ శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్యామ్‌సుందర్, సబ్బవరంలో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

పరవాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి తప్పనిసరిగా ముందస్తు ప్రణాళికలను రూపొందించుకోవాలని ఎంపీడీవో ఎస్‌డీ శ్యామ్‌సుందర్ సూచించారు. పంచాయతీ రాజ్- రూరల్ డెవలప్‌మెంట్, రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ సౌజన్యంతో ఏపీఎస్ఐఆర్‌డీ ఆధ్వర్యంలో సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో రెండు రోజుల శిక్షణను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మంజూరయ్యే నిధులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. విజన్ 2047లో భాగంగానే ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శిక్షకులు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఐఆర్‌డీ డిప్యూటీ డైరెక్టర్ రామనాథం, పంచాయతీ విస్తరణాధికారి కె.ధర్మారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ జి.షణ్ముఖ, వెలుగు ఏపీఎం బి.రంగారావు, ఎంఈవోలు దివాకర్‌రావు, సాయి శైలజా, ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారిలతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది గైర్హాజరుపై ఎంపీపీ ఆగ్రహం

సబ్బవరం : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా నిర్వహిస్తున్న సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగుల శిక్షణ శిబిరానికి పలువురు సచివాలయ సిబ్బంది డుమ్మా కొట్టడంపై ఎంపీపీ బోకం సూర్యకుమారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు డిజిటల్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వీఆర్వోలు గైర్హాజరు కావడంపై ఆమె ప్రశ్నించారు. ఇటువంటి సిబ్బందిపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపాలని ఎంపీడీవో పి.పద్మజకు ఆమె సూచించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ముందస్తు సమాచారం లేకుండా శిక్షణ కార్యక్రమానికి డుమ్మాకొట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధిపై శిక్షకులు సూచనలు చేశారు. ఈవోపీఆర్‌డీ బి.చైతన్య, ఏపీవో సీహెచ్.శ్రీనివాసరావు, హెల్త్‌సూపర్‌వైజర్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

'భూ సమస్యలకు 45 రోజుల్లోగా పరిష్కారం'


పరవాడ మండలం రావాడలో అర్జీని స్వీకరిస్తున్న తహసీల్దార్ అంబేడ్కర్

పరవాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చని స్థానిక తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్ అన్నారు. మండలంలోని రావాడలో మంగళవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. సమస్యలపై అర్జీలు చేసుకున్న వారికి 45 రోజుల్లోగా పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. రావాడ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 404లో 600 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, ప్రస్తుతం అది అటవీశాఖ ఆధీనంలో ఉందని సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు తెలిపారు. సదరు భూమిలో సుమారు 183 ఎకరాలను ప్రజల అవసరాలకు కేటాయించాలని రెవెన్యూ అధికారులను కోరారు. అలాగే ఇక్కడున్న 2.54 ఎకరాల ప్రభుత్వ భూమిని హైస్కూల్‌కు కేటాయించాలని విన్నవించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై సుమారు 300 అర్జీలు అందినట్టు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, వీఆర్వో సాయికుమార్, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

'ఇక భూ సమస్యలు స్థానికంగానే పరిష్కారం'


సబ్బవరం మండలం టెక్కలిపాలెంలో..

సబ్బవరం : మండలంలోని టెక్కలిపాలెంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.చిన్నికృష్ణ రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూ సమస్యలపై రైతులు ఎవరూ ఇకపై రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిఉండదన్నారు. ఎటువంటి సమస్య ఉన్నా స్థానికంగానే పరిష్కరిస్తామని వివరించారు. డిప్యూటీ తహసీల్దార్ గణపతిరావు, సర్పంచ్ గొంప సత్యవమ్మ, మాజీ సర్పంచ్ పంచాడ శ్రీను, గ్రామ పెద్దలు పైల రమణ, గొంప నాయనప్ప, సర్వేయర్లు రాంబాబు, రవితేజ, కనకారావు, ఇందిర, వీఆర్వోలు కామరాజు, ఈశ్వరరావు, రవి, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఈసీఎస్‌పై విచారణ

పర్సన్ ఇన్‌చార్జిగా అనకాపల్లి కలెక్టర్‌కు బాధ్యతలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సరఫరా సహకార సంస్థ (ఆర్‌ఈసీఎస్-రెస్కో)లో ఆర్థిక అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. సహకార రంగంలో ఉన్న ఈ సంస్థను ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) ఆదేశం మేరకు గతంలో ఏపీ తూర్పు విద్యుత్ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో విలీనం చేసిన సంగతి తెలిసిందే. ఆ సంస్థను గత మూడేళ్లుగా ఈపీడీసీఎల్ మంచి లాభాలతో నడుపుతోంది. ఇది సహకార రంగంలో ఉన్నప్పుడు అనకాపల్లి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేశారు. ఆర్‌ఈసీఎస్ చైర్మన్, ఎండీలుగా పనిచేసిన కొందరు తమకు నచ్చిన వారికి ఉద్యోగాలు ఇచ్చుకొని జేబులు నింపుకున్నారు. ఇవన్నీ వెలుగుచూడడంతో నిధులు దుర్వినియోగం కాకుండా ఈఆర్‌సీ కట్టడి చేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇతర కారణాలు చూపిస్తూ మళ్లీ ఆర్‌ఈసీఎస్‌ను సహకార సంస్థలోకి తేవాలని కొందరు ప్రయత్నాలు మొదలెట్టారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలో ఆర్‌ఈసీఎస్ విషయాలు ప్రస్తావించి, తగిన న్యాయం చేయాలని కోరగా, మంత్రి అచ్చెన్నాయుడు 51-ఏ విచారణ చేయిస్తామని ప్రకటించారు. అందులో భాగంగా జిల్లా కలెక్టర్‌ను ఆర్‌ఈసీఎస్‌కు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. సహకార సంస్థ నుంచి తగిన సమాచారం అడిగితే సరైన స్పందన ఉండడం లేదని కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆరు నెలల పాటు ఇన్‌చార్జిగా ఉండాలని ఆదేశాల్లో స్పష్టంచేశారు.

డిపాజిట్లు గల్లంతు

అనకాపల్లి ఆర్‌ఈసీఎస్ సహకార సంస్థగా నడిపినప్పుడు ఏటా ఆడిటర్ ద్వారా ఆర్థిక వ్యవహారాల లెక్కలు సమర్పించేవారు. ఆ గణాంకాల ప్రకారం 2015-16 ఆర్థిక సంవత్సరంలో రూ.41.09 కోట్ల డిపాజిట్లు బ్యాంకుల్లో ఉన్నాయని వెల్లడించారు. 2016-17లో రూ.42.86 కోట్లు చూపించారు. 2107-18లో రూ.40.03 కోట్లు ఉన్నాయని ప్రకటించారు. 2018-19లో ఆకస్మికంగా ఆ మొత్తం రూ.19.15 కోట్లకు తగ్గించి చూపించారు. 2020-21న సమర్పించిన ఆడిట్ రిపోర్టులో మొత్తం అన్ని డిపాజిట్లు కలిపి రూ.196.23 కోట్లు ఉన్నాయని తెలిపారు. అందులో వాటా మూలధనం, ప్రత్యేక రిజర్వులు, చట్టబద్ధ రిజర్వులు ఉన్నాయని ఆడిటర్ ఏవీఆర్ అండ్ కో నివేదిక సమర్పించింది. అయితే ఈఆర్‌సీ ఆదేశం మేరకు సంస్థను ఈపీడీసీఎల్‌కు అప్పగించినప్పుడు తమ దగ్గర ఎటువంటి డిపాజిట్లు లేవని అప్పటి అధికారులు చేతులెత్తేశారు. నామమాత్రపు నిల్వలు కలిగిన బ్యాంకు ఖాతాలను మాత్రమే అప్పగించారు. ఈ సందర్భంగా వారు నిధుల జమకు, ఖర్చులకు వేర్వేరు బ్యాంకు ఖాతాలు ఉపయోగించారనే విషయం బయటకు వచ్చింది. ఈపీడీసీఎల్ స్వాధీనం చేసుకున్న తరువాత వినియోగదారులకు సేవలు అందించడంపైనే దృష్టిపెట్టింది. గతంలో జరిగిన ఆర్థిక లావాదేవీల జోలికి వెళ్లకుండా గత వైసీపీ ప్రభుత్వం కట్టడి చేసింది. అప్పట్లో వైసీపీకి చెందిన ఓ ప్రజా ప్రతినిధి ఆర్‌ఈసీఎస్‌ను నచ్చినట్టు ఉపయోగించుకున్నారు. ఆ ప్రభుత్వంలోనే ఈపీడీసీఎల్ నుంచి మళ్లీ వెనక్కి తేవాలని యత్నించి విఫలమయ్యారు. ఇప్పుడైనా ఆర్‌ఈసీఎస్ ఆర్థిక వ్యవహారాలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి, రికవరీ చేయాలని అనకాపల్లి డిమాండ్ చేస్తున్నారు.

ఈ-శ్రమ్‌తో కార్మికులకు భరోసా

» అసంఘటితరంగాల్లో వారికి ఎంతో మేలు
» ప్రమాదవశాత్తూ మృతిచెందితే బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం
» 50 శాతానికిపైగా గాయపడితే రూ.లక్ష వరకు పరిహారం
» పేర్లు నమోదుకు పలుచోట్ల అందుబాటులో సేవలు

పరవాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అసంఘటితరంగ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తున్నది. వారికి సామాజిక భద్రతతోపాటు కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు 'ఈ-శ్రమ్' కార్డులను జారీ చేస్తున్నది. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు సంభవించినప్పుడు సాయం అందించడం, ఉపాధి కల్పనకు ఇది దోహదపడుతుంది..ఈ-శ్రమ్‌లో పేర్లు నమోదు చేసుకున్న వ్యక్తులు ఎవరైనా ప్రమాదవశాత్తూ మరణిస్తే బాధిత కుటుంబానికి ప్రమాద బీమా కింద రూ.2 లక్షలు పరిహారం అందుతుంది. ప్రమాదంలో 50 శాతానికి మించి అంగవైకల్యం సంభవిస్తే రూ.లక్ష వరకు ఆర్థిక సాయం పొందవచ్చు. అనివార్య కారణాల వల్ల కార్మికులు ఎవరైనా ఉపాధి కోల్పోతే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తారు.


ఈ-శ్రమ్ కార్డు నమూనా

ఎవరు అర్హులు?

భవన నిర్మాణ కార్మికులు, చిరువ్యాపారులు, దుకాణాల్లో పనిచేసే వారు, వ్యవసాయ కూలీలు, మత్స్యకారులు, పౌల్ట్రీ ఫారాల్లో పనిచేసేవారు, జాబ్‌కార్డు ఉన్న ఉపాధి కూలీలు, వీధి వ్యాపారులు, చేతివృత్తిదారులు, వివిధ రకాల కులవృత్తిదారులు, మెకానిక్‌లు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, కలాసీలు, ఆటో/రిక్షా కార్మికులు ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకోవచ్చు. 18 నుంచి 59 ఏళ్ల లోపువయసుండి, నెలకు రూ.15 వేలకన్నా తక్కువ ఆదాయం వుండి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లేని వారు అర్హులు.

ఈ-శ్రమ్‌లో ఎలా నమోదు చేసుకోవాలంటే..

ఈ-శ్రమ్‌లో పేర్లు నమోదుకు కామన్ సర్వీస్ సెంటర్, మీ-సేవా కేంద్రాలు, సచివాలయాలు, కార్మిక శాఖ కార్యాలయాల్లో సంప్రదించవచ్చు. కార్మిక శాఖ కార్యాలయాల్లో లేబర్ ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ-కేవైసీ కలిగిన ఆధార్, దీనికి అనుసంధానమైన ఫోన్ నంబర్ వున్న మొబైల్ తీసుకొని కేంద్రాలకు వెళ్లాలి. ఈ-శ్రమ్ కార్డు పొందినప్పటికీ దీనికి సంబంధించిన ప్రయోజనాలు అందకపోతే 14434 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్ ఫొటో)

గ్రామాల్లో అవగాహన సదస్సులు



\- కె.వసంతరావు, కార్మిక శాఖ సహాయ కమిషనర్, అనకాపల్లి

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ-శ్రమ్ కార్డులు కార్మికులకు భరోసా కల్పిస్తాయి. దీనిని కార్మికులంతా సద్వినియోగం చేసుకోవాలి. ఈ-శ్రమ్‌లో నమోదు కోసం గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఈ-శ్రమ్ కార్డులు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలియజేస్తున్నాం.

అదనపు కట్నం తెమ్మంటున్న భర్త, అత్తలపై ఫిర్యాదు

మునగపాక, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లను కన్నందుకు అదనంగా కట్నం తేవాలంటూ భర్త, అత్త డిమండ్ చేస్తున్నారని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపిన సమాచారం మేరకు.. వాడ్రాపల్లి గ్రామానికి చెందిన అనసూయ లక్ష్మీనారాయణకు నూకరత్నంతో 2022లో వివాహం జరిగింది. కొంతకాలం తరువాత వీరికి ఆడపిల్ల జన్మించింది. అమ్మాయిని కన్నందుకు పుట్టింటి నుంచి మరింత కట్నం తేవాలని భర్తతోపాటు అత్త డిమాండ్ చేస్తున్నారు. నాలుగు నెలల నుంచి మంచిచెడ్డలు పట్టించుకోవడంలేదు. చివరకు భర్త ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. దీంతో నూకరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

ప్రభుత్వ భూమిలో ఇసుక తవ్వకాలు

... 5వ పేజీ తరువాయి

దాడి చేసి గాయపరిచారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదు. దీంతో కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గనులు, పంచాయతీ, రెవెన్యూ శాఖల కిందిస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

మండలంలోని జంగాలపల్లిలో సర్పా నదిని అనుకొని 661 సర్వే నంబరులో 16 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిని కొంతమంది రైతులు ఆక్రమించుకున్నారు. ఇటీవల ఇసుక తవ్వకాల కోసం అనధికారికంగా ఎకరా ఆరు లక్షల రూపాయలకు విక్రయించారు. భూమిని కొనుగోలు చేసిన వ్యక్తులు ఇసుక తవ్వకాలు చేపట్టారు. ప్రభుత్వ భూమికి పక్కనే అల్లు రామునాయుడు, భాస్కర్, అప్పలనాయుడు, తదితర రైతులకు జిరాయితీ భూములు వున్నాయి. ప్రభుత్వ భూమిలో గత 20 రోజులనుంచి ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. పది నుంచి 15 అడుగుల లోతున భారీ మొత్తంలో ఇసుక తవ్వుతున్నారు. దీనివల్ల భవిష్యత్తులో తమ భూములకు ముప్పు వాటిల్లుతుందని అంటూ అల్లు రామునాయుడు, ఇసుక తవ్వకాలకు అభ్యంతరం చెప్పారు. దీంతో ఇసుక అక్రమార్కులు అతనిపై దాడి చేయి తీవ్రంగా గాయపరచగా, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పది రోజులు అవుతున్నా ఇసుక తవ్వకందారులపై చర్యలు తీసుకోకపోవడంతో రామునాయుడు ఈ నెల 16వ తేదీన అనకాపల్లి వెళ్లి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మైనింగ్ అసిస్టెంట్ జియాలజిస్ట్ రమణ, డీఎల్‌పీవో మూర్తి, ఎంపీడీవో సీతా మహాలక్ష్మి, వీర్‌వోలు సూరిబాబు, కమల జంగాలపల్లి వచ్చి ప్రభుత్వ భూముల్లో జరుగుతున్న ఇసుక తవ్వకాలను పరిశీలించారు. ప్రభుత్వ భూమిని కొంతమంది రైతులు ఆక్రమించుకుని, ఇటీవల ఇసుక తవ్వకాల కోసం ఎకరా రూ.6 లక్షలకు అనధికారికంగా విక్రయించినట్టు చుట్టుపక్కల జిరాయితీ భూములు వున్న రైతులు వారికి చెప్పారు. ఇసుక అక్రమ తవ్వకందారుల దాడిలో గాయపడిన అప్పలనాయుడు నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. ఇసుక తవ్వకాలు జరిపితే కేసులు పెట్టాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ భూముల్లో ఇసుక తవ్వకాలపై నివేదికను తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

తాండవ డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక ఏకగ్రీవం

... 5వ పేజీ తరువాయి

అధ్యక్షులు తమలో నుంచి డీసీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డీసీ-1 అధ్యక్షుడిగా పారుపల్లి వరహాలబాబు, ఉపాధ్యక్షుడిగా అప్పన్న కన్నాలుదొర (దివాణం), డీసీ-2 అధ్యక్షుడిగా మేరపురెడ్డి జోగిబాబు, ఉపాధ్యక్షుడిగా లాలం గోవింద్, డీసీ-3 అధ్యక్షుడిగా లోకవరపు పుల్లయ్యనాయుడు, ఉపాధ్యక్షురాలిగా పల్లెల దేవి ఎన్నికయ్యారు. కాకినాడ జిల్లాకు సంబంధించి డీసీ-4 అధ్యక్షుడిగా కరక సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా చింతకాయల సురేశ్‌కుమార్, డీసీ-5 అధ్యక్షుడిగా షేక్ బడే సాహెబ్, ఉపాధ్యక్షుడిగా ఇటంశెట్టి రమణమూర్తిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 21వ తేదీన ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక జరుగుతుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు డిస్ట్రిబ్యూటరీ కమిటీ-4 అధ్యక్షుడు కరక సత్యనారాయణను ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవికి ఎంపిక చేసినట్టు తెలిసింది.

వసతి గృహంలో బిక్కుబిక్కుమంటూ..

ప్రహరీ గోడ, స్నానాల గదులకు తలుపుల్లేక విద్యార్థినుల అవస్థలు

» ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన
» వసతులు కల్పించాలని తల్లిదండ్రుల వేడుకోలు

నాతవరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక వసతి గృహంలో కనీస సదుపాయాలు లేకపోవడంతో బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. వసతి గృహానికి ప్రహరీ గోడ లేకపోవడం, స్నానాల గదులకు తలు పులు లేకపోవడంతో బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారు.


తలుపుల్లేని స్నానాల గదులు


బాలికలు ఉంటున్న వసతి గృహం ఇదే..


ప్రహరీ గోడ లేని వసతి గృహం

నాతవరం బాలికల వసతి గృహం హైస్కూల్‌కు కిలోమీటరుకు పైగా దూరంలో ఉండడమే కాకుండా ఊరి చివర ఉండడంతో ఆకతాయిల బెడద ఎక్కువగా ఉండేది. ఈ విషయాన్ని బాలికలు చెప్పడంతో స్వయంగా ఇన్‌చార్జి డీడీ రాజేశ్వరి విచారణ జరిపి హైస్కూల్‌కు దగ్గరగా ఉండే నాతవరం ఎస్సీ బాలుర వసతి గృహంలోకి 15 రోజుల క్రితం బాలికలను తరలించారు. అక్కడ ఉండే బాలురను బాలికల వసతి గృహానికి మార్చారు. అయితే ప్రస్తుతం బాలికలు ఉంటున్న వసతి గృహం ఆర్టీసీ బస్టాండ్ పక్కనే ఉండడం, రోడ్డు వైపు ప్రహరీ గోడ లేకపోవడం, స్నానాల గదులకు తలుపులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే వసతి గృహంలో సదుపాయాలు కల్పించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు రాష్ట్ర జట్లు పయనం

» ఈ నెల 21 నుంచి 24 వరకు అయోధ్యలో నిర్వహణ

తుమ్మపాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న 68వ జాతీయ స్కూల్‌గేమ్స్ ఖోఖో చాంపియన్‌షిప్ అండర్-19 పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలురు, బాలికల జట్లు మంగళవారం అనకాపల్లి నుంచి బయలుదేరాయి. ఈ సందర్భంగా క్రీడాకారులకు అనకాపల్లి మండలం తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యా శాఖాధికారి అప్పారావునాయుడు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.


జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొననున్న రాష్ట్ర బాలురు, బాలికల జట్లు

బాలుర జట్టు

జి.అజయ్(విశాఖ), బి.సాయి(విశాఖ), సీహెచ్.చరణ్(విశాఖ), డి.వినయ్(ప్రకాశం), పి.నరేష్ (ప్రకాశం), డి.రాకేశ్ (కృష్ణా), ఎం.శివ (విజయనగరం), బి.తిరుమల(శ్రీకాకుళం), ఇ.శేషనార్‌గౌడ్ (అనంతపురం), ఎస్.నవీన్ (నెల్లూరు), జె.యల్లప్ప(కర్నూలు), బి.పవన్(చిత్తూరు).

బాలికల జట్టు

కె.లాస్య(విశాఖ), పి.జ్యోత్స్న(విశాఖ), జె.గీత(విశాఖ), సీహెచ్.లావణ్య(విజయనగరం), బి.భార్గవి (నెల్లూరు), కె.పవిత్ర(నెల్లూరు), డి.రంగమహాలక్ష్మి(గుంటూరు), కె.దివ్య(పశ్చిమగోదావరి), ఎన్.హస్మిత(చిత్తూరు), జి.దేవి(కడప), జి.భవాని(శ్రీకాకుళం), బి.కల్యాణి(ప్రకాశం). బాలికల జట్టుకు కోచ్‌గా కేఎం నాయుడు, మేనేజర్‌గా పి.లక్ష్మి వ్యవహరించనున్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఉమ, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పెతకంశెట్టి బలరాం, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎంవీ నాగేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో మట్టి అక్రమ తవ్వకాలు

» ట్రాక్టర్లతో పట్టపగలు యథేచ్ఛగా రవాణా
» పట్టించుకోని అధికారులు

అచ్యుతాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండంలోని గొర్లె ధర్మవరం పంచాయతీ సర్వే నంబరు 124/2లో వున్న సీతమ్మ చెరువులో ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు, రవాణా సాగుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధి బంధువులే మట్టి తవ్వకాలు జరుపుతుండడంతో అధికారులు పట్టించుకోవడంలేదని తెలిసింది. సోమవారం ఉదయం నుంచి ట్రాక్టర్ల ద్వారా ఎర్రమట్టిని అచ్యుతాపురం మండలం కాంప్లెక్స్ పక్కన ఒక భవన నిర్మాణం పునాదులు నింపడానికి రవాణా చేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ లోడు రూ.1,200లకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. పట్టపగలే ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు, రవాణా జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదు.


అచ్యుతాపురం మండలం గొర్లె ధర్మవరంలో మట్టి తవ్వకాలు జరిపిన సీతమ్మ చెరువు, మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్


ఎలమంచిలి మండలం పులపర్తి సమీపంలో చెరువు గట్టును ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతున్న దృశ్యం

చెరువు గట్టు తవ్వేస్తున్నారు..

ఎలమంచిలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులపర్తి, గూండ్రుబిల్లి గ్రామాల మధ్యగల చెరువు గట్టును మట్టి కోసం ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తవ్వి ట్రాక్టర్లలో తరలించారు. పట్టపగలు, ప్రధాన రహదారికి ఆనుకుని చెరువు గట్టును తవ్వేస్తున్నప్పటికీ సచివాలయ సిబ్బంది అడ్డుకోవడంలేదు.. ఈ విషయాన్ని జలవనరుల శాఖ ఏఈ రామకృష్ణ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా, తమ సిబ్బందిని పంపి తవ్వకాలను నిలుపుదల చేయించామని చెప్పారు. మట్టి తవ్విన, రవాణా చేసిన వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్లు సేకరించామని, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

క్రైం... crime news

లారీ డ్రైవర్‌కి పదేళ్ల జైలు శిక్ష

» ఆరుగురి మృతికి కారకుడైనందున శిక్ష ఖరారు

గూడెంకొత్తవీధి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌వీనగర్ గ్రామం వద్ద ఏడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కి పదేళ్ల జైలు శిక్ష, రూ.రెండు వేల జరిమానా విధిస్తూ విశాఖపట్నం తొమ్మిదవ అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పి.గోవర్ధన తీర్పు ఇచ్చినట్టు స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.వరప్రసాద్ తెలిపారు. మంగళవారం సీఐ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2017 ఏప్రిల్‌లో ఒడిశాకు చెందిన డ్రైవర్ తరుణ్ హల్దార్ నిర్లక్ష్యం కారణంగా రహదారిపై నిల్చొని ఉన్న వ్యక్తులపై లారీ దూసుకుపోవడంతో ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారన్నారు. ఈ ఘటనపై జీకేవీధి పోలీసులు కేసు నమోదు చేయగా, నాటి చింతపల్లి డీఎస్పీ అనిల్ పులిపాటి విచారణ చేపట్టి న్యాయ స్థానానికి చార్జిషీటు దాఖలు చేశారన్నారు. బాధితుల తరఫున ఏపీపీ బి. వీరభద్రరావు న్యాయస్థానం ఎదుట వాదనలు వినిపించారన్నారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి న్యాయమూర్తి శిక్షను ఖరారు చేశారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నర్సీపట్నంవాసి మృతి

కూర్మన్నపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన వడ్లపూడి వంతెనపై మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా వున్నాయి. నర్సీపట్నం మునిసిపాలిటీ జోగునాయుడుపాలేనికి చెందిన పి.వరహాలుబాబు(30), వి.శ్రీనివాసరావు ద్విచక్రవాహనంపై మంగళవారం గాజువాక వచ్చారు. ఇక్కడ పని పూర్తిచేసుకుని రాత్రి కూర్మన్నపాలెం వైపు వస్తుండగా, వడ్లపూడి పైవంతెనపై బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వరహాలు బాబును 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావును అతడి స్నేహితుడు వెంకటరమణ షీలానగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఇతను నర్సీపట్నం మునిసిపాలిటీ మాజీ కౌన్సిలర్ అని తెలిసింది. దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ముందు టైరు పేలడంతో ప్రమాదం

ఎస్. రాయవరం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గెడ్డపాలెం జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై వెళుతున్న ఓ లారీ టైరు పేలి ప్రమాదానికి గురైంది. దీనికి సంబంధించి లారీ డ్రైవర్ అందించిన వివరాలిలా వున్నాయి. విజయనగరం జిల్లా రాజాం నుంచి నూకల బస్తాల లోడుతో రాజమహేంద్రవరం వెళుతున్న లారీ గెడ్డపాలెం జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి ఎడమవైపు ముందు టైర్ పేలింది. దీంతో లారీ అదుపుతప్పి ఎడమ వైపున ఉన్న డివైడర్‌ను ఢీకొని ఆగింది. ఈ క్రమంలో ముందు టైర్ల యాక్సిల్ విరిగిపోయింది. ఎవరికీ ముప్పు వాటిల్లకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

మునగపాక, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కలిసి వ్యాపారం చేయడం ద్వారా డబ్బు సంపాదించవచ్చని ఆశ చూపి మోసం చేసిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. మునగపాకకు చెందిన కొయిలాడ తులసీరావు, సబ్బి శివగణేశ్ స్నేహితులు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ద్వారా పలు రకాల వస్తువులు కొనుగోలు చేసి, వాటిని రిటైల్‌గా విక్రయించడం ద్వారా లాభం పొందవచ్చునని శివ గణేశ్ చెప్పడంతో తులసీరావు సుముఖత వ్యక్తం చేశాడు. గత ఏడాది లక్ష రూపాయలతో వస్తువులు కొనుగోలు చేసి విక్రయించడం ద్వారా రూ.30 వేలు లాభం రావడంతో, ఈ ఏడాది వ్యాపారాన్ని మరింత పెంచుదామని గణేశ్ చెప్పాడు. దీంతో దఫదఫాలుగా సుమారు రూ.55 లక్షలను డిజిటల్ ప్లాట్‌ఫారాల ద్వారా తులసీరావు అతనికి పంపాడు. తరువాత శివగణేశ్ కమిషన్‌తోపాటు అసలు సొమ్ము కూడా తిరిగి ఇవ్వకపోవడంతో అతని ఇంటికి వెళ్లి వాకబు చేశాడు. ఆచూకీ లభించకపోవడం, ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి వుండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

టెన్త్ విద్యార్థుల వివరాలను అప్‌లోడ్ చేయాలి

తుమ్మపాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల వివరాలను ఈ నెల 19వ నుంచి 23వ తేదీ వరకు క్షుణ్ణంగా పరిశీలించి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ జిల్లా విద్యా శాఖాధికారి జి.అప్పారావునాయుడు మంగళవారం ఒక ప్రకటనలో ప్రధానాపాధ్యాయులను ఆదేశించారు. రికార్డుల ప్రకారం అపార్ ఐడీ ఉండాలని, తప్పులుంటే సరిచేయించాలని ఆయన సూచించారు.

రెవెన్యూ సమస్యలు ఏకరువు

... 5వ పేజీ తరువాయి

వివాదాలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రి అనగాని మాట్లాడుతూ క్రిస్టియన్ భూములను 22ఏలో చేర్చడంపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ 22-ఏలో ప్రభుత్వ భూములతోపాటు ప్రైవేటు భూములు చేరాయన్నారు. ఇరవై ఏళ్లుగా లేనిది ఇప్పుడు తన ఇంటి స్థలం 22-ఏలో చేరిందని, దానివల్ల రుణం తీసుకోవడానికి ఇబ్బంది అవుతోందని, తనలాంటి ఎంతోమంది ఇటువంటి ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్య అన్నిచోట్ల ఉందని, దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి సమాధానం ఇచ్చారు. ఇదే సమస్యపై ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ కలెక్టర్లు ఎన్‌వోసీ ఇచ్చి మళ్లీ 22ఏలో ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. రాజకీయ బాధితులు (పొలిటికల్ సఫరర్స్), ఎక్స్ సర్వీస్‌మెన్‌కు ఇచ్చిన భూములను 22ఏలో చేర్చడంపై ఆయన తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తంచేశారు. వీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టినట్టు మంత్రి సమాధానమిచ్చారు. టీడీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని డీఎంఎస్ పురం గ్రామాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించడం లేదని, ఈ గ్రామానికి సంబంధించి భూ వివాదాలు ఉన్నాయని, రీ సర్వే జరిపి రైతులకు మేలు చేయాలన్నారు. రీ సర్వేను రీ డిజైన్ చేస్తున్నామని, కొద్దిరోజుల్లోనే ప్రక్రియను ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు నేరుగా వెళ్లి చర్యలు తీసుకుంటున్నారని, స్థానికంగా ఉంటున్న తమకు కనీసం సమాచారం ఇవ్వడం లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్టీ మారలేదన్న ఉద్దేశంతో ఒక నాయకుడికి చెందిన భూములను 22ఏలో చేర్చారని, రాజకీయ కక్ష సాధింపునకు 22ఏను మార్చుకున్నారని, దానిపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీలకు భూసేకరణలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని, కొందరు నాయకులు రూ.కోట్లు గడించారన్నారు. కొందరు బోగస్ వ్యక్తులు లబ్ధిదారులుగా చేరారని పేర్కొన్నారు. ఈ ఇళ్ల పట్టాలను పదేళ్లపాటు అమ్మకూడదని, కానీ, 60 శాతం విక్రయాలు జరిగిపోయాయన్నారు. దీనిపై స్పందించిన మంత్రి అనగాని 22ఏలో తప్పులు జరిగాయని, దానిపై విచారణ జరిపిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జగనన్న ఇళ్ల లబ్ధిదారుల్లో ఏడు లక్షల మంది బోగస్‌గా గుర్తించామన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ తాడి గ్రామం తరలింపు ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని కోరారు. దీనిపై ఉన్నతాధికారులకు తగిన ఆదేశాలు జారీచేస్తామని మంత్రి స్పష్టంచేశారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గం పరిధిలో 2.08 ఎకరాలు భూమి మాత్రమే ఉందని, దానిని పరిరక్షించుకోవాలన్నారు. కొందరు జర్నలిస్టుల పేర్లతో ఫిర్యాదులు చేసి బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని, అటువంటి ఫిర్యాదులపై అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. సనపల సీతారామ్ అనే వ్యక్తి ప్రభుత్వ భూమిని ఆక్రమించాడని పేర్కొన్నారు. జాతీయ రహదారిపై ఉన్న గ్రీన్‌బెల్టును ఆక్రమించి మరీ మాల్‌లోకి వెళ్లేందుకు నాలుగు ఎంట్రీలు, ఎగ్జిట్ పాయింట్స్ పెట్టారని, ప్రశ్నిస్తే జాతీయ రహదారుల శాఖ అధికారులు అనుమతి ఇచ్చారని చెబుతున్నారన్నారు. అనుమతులు ఇచ్చుకుంటూ పోతే గ్రీన్ బెల్ట్ ఉండదని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దానిపై ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీచేస్తామని, ఇటువంటి వాటిని ఉపేక్షించబోమని మంత్రి స్పష్టం చేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	103.00
లైవ్ ధర	123.00
విత్ స్కిన్	216.00
స్కిన్ లెస్	226.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	620
విజయనగరం	624
శ్రీకాకుళం	624